RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 127 | గురువారం, జూన్ 20, 2024 | పేజీలు : 4

## ఈటెల రాజేందర్ మెడికల్ కాలేజీలో విద్యార్థినిలు ఆందోళన

సిద్దిపేట: బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ మెడికల్ కాలేజీలో విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. ఆర్ విఎం మెడికల్ కాలేజీ విద్యార్థినులు అధ్యాపకులు వేధిస్తున్నారంటూ ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని ఆర్ విఎం మెడికల్ కళాశాలలో తమను అధ్యాపకులు దుర్భాషలాడుతూ, బయటకు చెప్పుకోలేని విధంగా మాట్లాడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థినిలు కన్నీళ్లు పెట్టుకున్నారు. తమ ఫోన్లను తీసుకొని డేటాను చెక్ చేస్తున్నారని, ఓవర్ డ్యూటీలు వేస్తున్నారని, సెలవు ఉన్నా సెలవులు ఇవ్వకుండా తమకు మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ అధ్యాపకులను తొలగించి వేరే అధ్యాపకులను నియమించాలని విద్యార్థినులు ఆందోళనకు దిగారు.

### ఆ కంపెనీలకు రుణాలు ఇస్తారు...

## రైతులకు ఎందుకు ఇవ్వరు




హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ పంటలు వస్తున్నాయని, తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. మ్యారీగోల్డ్ హొటల్‌లో 41వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు. 2024-25 వార్షిక రుణ ప్రణాళికపై విస్తృత చర్చ జరిగింది. బ్యాంకర్ల సమావేశంలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ అంశంపై కీలక చర్చ జరిగిన సందర్భంగా తుమ్మల మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు రుణాలు పెంచాలని, దశాబ్ధాలుగా రైతేరాజు అంటున్నామని, కానీ బ్యాంకు గణాంకాలు చూస్తూ భయం వేస్తోందన్నారు. బహుళజాతి, ఇన్ఫ్రా కంపెనీలకు రూ. వేల కోట్ల రుణాలు ఎలా ఇస్తున్నారని అడిగారు. రైతులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు వెనకడుగు వేస్తున్నాయని, పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం ఉండకూడదని, రైతులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయమంటే బ్యాంకర్లు ఎందుకు స్పందించడంలేదని తుమ్మల ప్రశ్నించారు. నిబంధనలు ప్రకారమే బ్యాంకర్లు వ్యవహరించాలని తుమ్మల సూచించారు.

### పేదోళ్ళ ఫైలుపైనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

## తొలి సంతకం



**విజయవాడ:** ఏపీ ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఉపముఖ్యమంత్రి హొదాలోని పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఉపాధి హామీ పనులను ఉద్యానవన శాఖ చేపట్టే పనులను అనుసంధానం, నిధుల మంజూరు ఫైల్ పై తొలి సంతకం చేశారు. దీంతో పల్లెల్లోని ఉపాధి హామీ కూలీల పని రోజులు పెరుగుతాయి. కరువు జిల్లాల్లో ఉపాధి హామీ పనులు ఇక జోరందుకుంటాయి. ఇక గిరిజనం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గిరిజన తండాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు ఫైల్ పై సంతకం చేశారు. ఇక 2019లో ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. జాతీయ 'ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తాం.

ఈ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టబోతున్నాం. మహిళా దినోత్సవం రోజున రైతులకు జనసేన ఇస్తున్న మాట ఇది. ఆడపడుచుల విన్నపాలు అందిన తరువాత వచ్చిన ఆలోచనే ఇది' అని 2019లో మహిళా దినోత్సవ వేడుకల్లో జనసేనాని మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ మాటను పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. అనంతరం సోదరుడు నాగబాబు, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, నేతలు పవన్‌కు అభినందనలు తెలిపారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, తెదేపా నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అభినందనలు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం మధ్యాహ్నం మంగళగిరి నుంచి అమరావతిలోని సచివాలయానికి బయల్దేరారు. ఆయనకు అమరావతి రైతులు అడుగడునా టన్నుల కొద్దీ బంతిపూలతో స్వాగతం పలికారు. ఇంతలో పవన్ కళ్యాణ్ కాన్వాయ్ వెళుతుండగా.. ఓ అభిమాని ఓ పెన్నును గిఫ్ట్‌గా అందించారు.

### నలంద ఒక పేరు కాదు...

## ఒక గుర్తింపు



పాట్నా: నలంద ఒక పేరు మాత్రమే కాదని, అది ఒక గుర్తింపు, ఒక గౌరవమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బీహార్‌లోని నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నలంద ఒక అమూల్యమైన పందని, అది ఒక మంత్రమని ఆయన చెప్పారు. పుస్తకాలను అగ్ని ఆహుతి చేయవచ్చునేమోకాని జ్ఞానాన్ని చెరిపివేయలేవని ప్రధాని అన్నారు. మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి బీహార్‌ను సందర్శించిన ప్రధాని మోడీ నలంద విశ్వవిద్యాలయంలో గతంలో చవిచూసిన పోరాటాలను గుర్తు చేశారు. నలందను ఒక రుషిగా ఆయన అభివర్ణించారు. నలంద విశ్వవిద్యాలయం చరిత్ర ఒక్క భారతదేశానికే పరిమితం కాదని, అది ఆసియా ఖండానికే చెందినదని మోడీ అన్నారు. విశ్వవిద్యాలయం పునర్నిర్మాణంలో మన పొరుగుదేశాలు కూడా పాల్గొన్నాయని ఆయన వెల్లడించారు. ఇది వసుదైక కుటుంబం స్ఫూర్తిగా ఆయన పేర్కొంటూ ప్రపంచ నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారని, 20 దేశాలకు పైగా విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారని ప్రధాని తెలిపారు. అంతకుముందు ఆయన నలంద విశ్వవిద్యాలయానికి చెందిన శిథిలాలను సందర్శించారు. వీటిని 2016లో యునెస్కో వారసత్వ సంపదగా ప్రకటించింది. భారతదేశ గత వైభవ చిహ్నమైన నలంద విశ్వవిద్యాలయాన్ని ప్రధాని కీర్తిస్తూ ప్రపంచ దేశాలకు చెందిన యువజనుల వ్యిపరమైన అవసరాలను ఈ విశ్వవిద్యాలయం తీర్చగలదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. మన విద్యా రంగంలో నేడు ఒక ప్రత్యేక సుదినమని ఎక్స్ వేదికగా ప్రధాని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నలంద విశ్వవిద్యాలయానికి చెందిన నూతన క్యాంపస్‌ను రాజ్‌గిర్ వద్ద ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ప్రధాని నేతృత్వంలో కేంద్ర కేబినెట్ భేటీ..!

## 14 పంటలకు ఎంఎస్‌పీ..!



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్రమంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. వరి, రాగులు, మినుము, జొన్న, మక్కజొన్న, పత్తి సహా 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర (%మీస్రా%) కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలిపారు. అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం మంత్రివర్గంలో కీలకమైన నిర్ణయం తీసుకుందన్నారు. ఖరీఫ్ పంటకు 14 పంటలకు ఎంఎస్‌పికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వరి కొత్త ఎంఎస్‌పీని రూ. 2,300 నిర్ణయించినట్లు తెలిపారు. ఇది గత ఎంఎస్‌పీ కంటే రూ. 117 ఎక్కువ. ఖరీఫ్ పంటల కొత్త ఎమ్మెస్పీపై అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'ఈ నిర్ణయంతో రైతులకు దాదాపు రూ. 2లక్షల కోట్లు అందుతాయన్నారు. ఇది గత సీజన్ కంటే రూ. 35వేల కోట్లు ఎక్కువ' చెప్పారు.



ఇదిలా ఉండగా.. కేంద్రం 2లక్షల గోడౌన్ల నిర్మాణానికి కసరత్తు చేస్తున్నది. ఈ ప్రాజెక్టుతో పాటు మహాపాల్‌ఘర్-బధావన్ పోర్ట్ ప్రాజెక్ట్ ఆమోదం తెలిపింది. మహారాష్ట్రలో రూ. 76వేల కోట్లతో వధవన్ పోర్ట్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ చేసింది. రూ. 76,200 కోట్లతో నిర్మించనున్న ఈ ఓడరేవు పూర్తయితే ప్రపంచంలోని టాప్ 10 పోర్టుల్లో ఒకటిగా నిలుస్తుంది. మొత్తం రూ. 7,453 కోట్లతో గుజరాత్, తమిళనాడులో గిగావాట్ ఆఫ్‌షోర్ పవన విద్యుత్ ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త టెర్మినల్, రన్‌వే పొడిగింపుతో సహా వారణాసి విమానాశ్రయం అభివృద్ధికి రూ. 2,869.65 కోట్ల ప్రతిపాదనకు, కాశీ విమానాశ్రయానికి కొత్త టెర్మినల్ భవనం, కొత్త రన్‌వే, అండర్‌పాస్ హైవే నిర్మాణానికి సైతం కేబినెట్ ఆమోదించినట్లు మంత్రి వివరించారు.


### పెట్టుబడులకు తెలంగాణ

## స్వర్గధామం




హైదరాబాద్: దేశంలో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతుందని, దేశవాసులకే కాదు, యావత్ ప్రపంచానికి తెలంగాణ పెట్టుబడుల స్వర్గధామం అని అన్నారు. మ్యారీగోల్డ్ హొటల్‌లో 41వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు. 2024-25 వార్షిక రుణ ప్రణాళికపై విస్తృత సమావేశంలో భట్టి మాట్లాడారు. రాజధానిలో ఒఆర్‌ఆర్ , ఎయిర్ పోర్టు, చౌకగా మానవ వనరులు, మంచి వాతావరణం, ఫ్రెండ్లీ గవర్నమెంట్, కాస్మోపాలిటన్ సిటీ, భాషా సమస్య లేదన్నారు.

## నీటి సమస్యపై అతిషి అల్టిమేటం




### జూన్ 21 నుంచి నిరవధిక దీక్ష


న్యూఢిల్లీ: ఢిల్లీలో నీటి సంక్షోభంపై తాను ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశానని ఢిల్లీ మంత్రి అతిషి బుధవారం వెల్లడించారు. దేశ రాజధానిలో నీటి సమస్యను పరిష్కరించని పక్షంలో ఈనెల 21 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని ఆమె హెచ్చరించారు. నీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ప్రధానికి రాసిన లేఖలో తాను విజ్ఞప్తి చేశానని తెలిపారు. ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను హరియాణ సరఫరా చేయకపోవడంతో దేశ రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హరియాణ మంగళవారం 613ఎంజీడీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా 513ఎంజీడీ నీటిని మాత్రమే నగరానికి సరఫరా చేసిందని ఆమె వెల్లడించారు. ఒక ఎంజీడీ నీరు 28,500 మందికి సరిపోతుందని, దీంతో 28 లక్షల మంది ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోరుతూ తాను హరియాణ ప్రభుత్వానికి పలుమార్లు లేఖ రాసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నీటి చౌర్యం, బ్లాక్ మార్కెటింగ్ అంశాల నుంచి నగరవాసుల దృష్టి మరల్చేందుకు అతిషి ఇప్పుడు సరికొత్త దిగజారుడు రాజకీయానికి తెరలేపారని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు.

## సంపాదకీయం

# ఎగ్జిట్ పోల్ విశ్వసనీయతకు షాక్!

ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు కొన్ని కొన్ని సార్లు ఖచ్చితమైనవిగా మారకపోయినా, ఎక్కువ సందర్భాల్లో అవి ఎగ్జాక్ట్ పోల్ ఫలితాలకు దాదాపు దగ్గరలో వుండడం ఓ ఆనవాయితీగా కొనసాగేది. ఐతే ఈ సాంప్రదాయానికి భిన్నంగా పద్దెనిమిదవ లోకసభకు జరిగిన సాధారణ ఎన్నికలకు సంబంధించి జాతీయ స్థాయిలో పేరు గాంచిన ఎన్నికల వ్యూహకర్తలతో పాటు ప్రముఖ పత్రికలూ, ప్రసార సాధనాలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్ ఘోరంగా విఫలమవడం తెలిసిందే. తమ అంచనాలకు ప్రాతిపదికలుగా ఏయే అంశాలను పరిగణన లోనికి తీసుకున్నారో గానీ ఎగ్జాక్ట్ ఫలితాల వెల్లడి తర్వాత సదరు అంచనాలన్నీ సత్యదూరమైనవిగా రుజువయ్యాయి. దీంతో ఎగ్జిట్ పోల్ విశ్వసనీయతే ప్రశ్నార్థకమైపోయింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను ఎగ్జాక్ట్ పోల్ ఫలితాలు తలకిందులు చేసిన తర్వాత ప్రశాంత్ కిషోర్ లాంటి ప్రముఖ సెఫాలజిస్ట్, ఎన్నికల వ్యూహకర్త ఎన్నికల ఫలితాల సరళిని అంచనా వెయ్యడంలో వైఫల్యం చెందినందుకు బాధగా వుందంటూ పశ్చాత్తాపపడడం, మరో ప్రముఖ పత్రికా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి టెలివిజన్ ఛానెల్లో వెక్కివెక్కి ఏడ్వడం, తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ నాయకులకూ, సినిమా రంగంలో సెలబ్రిటీలకూ జోస్యం చెప్పే ఓ ప్రముఖ జ్యోతిష్యుడు ఇక నుండి ఎన్నికల్లో గెలుపు, ఓటములకు సంబంధించిన అంచనాల జోలికి వెళ్లనని లెంపలేసుకోవడంతో పాటు, ఇతర అనేక చిన్నా, పెద్ద సర్వే సంస్థల అధిపతులు మీడియాకు అందనంత దూరంలో అజ్ఞాతంలోకి వెళ్ళడం కొసమెరుపు. ఎన్నికలలో కౌంటింగ్ తర్వాత ఏ పార్టీ ఎన్ని సీట్లతో గెలిచి అధికారాన్ని చేపడుతుందో, ఏ పార్టీ ఓటమి పాలై ప్రతిపక్షంలో కొనసాగుతుందో సంభావ్యతా సిద్ధాంతం ఆధారంగా అంచనా వేయడానికి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనమే ఎగ్జిట్ పోల్. ఈ ప్రక్రియను గతంలో ఆయా రాజకీయ పార్టీల పెద్ద నేతలకు వారికి భవిష్యత్తును తెలియ జేసే స్వాములూ, జ్యోతిష్కులూ చేపట్టే వారు. ఐతే ఈ మధ్య కాలంలో ఎన్నికల వ్యూహకర్తలూ, సెఫాలజిస్టులతో పాటు, వివిధ మీడియా సంస్థలు ఈ ప్రక్రియలో పాలుపంచుకోవడం విశేషం. ఎన్నికలకు ముందు ఒపీనియన్ పోల్స్‌తో పాటు పోలింగ్‌లో పాలుపంచుకున్న ఓటర్లు పోలింగ్ కేంద్రాల నుండి తిరిగి ఇండ్లకు వెళ్ళే క్రమంలో వారిలో కొంతమందిని శాంపిల్‌గా తీసుకుని వారి హావభావాలను, అభిప్రాయాలను శాస్త్రీయంగా పరిశీలించి, విశ్లేషించి, మదించి తద్వారా వారు ఏ రాజకీయ పార్టీకి తమ ఓటును వేశారో తెలుసుకోవడానికి ప్రయత్నించే ఓ నిష్పక్షపాతమైన, శాస్త్రీయమైన అధ్యయన విధానమే ఎగ్జిట్ పోల్. మెజార్టీ ఎగ్జిట్ పోల్ సంస్థలు 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అనే భాజపా నినాదాన్ని సమర్థిస్తూ ఆ పార్టీ స్వంతంగా 350 పై చిలుకు స్థానాలలో గెలుపొందుతుందని, అదే విధంగా ఎన్డీఏ కూటమి 400 పై చిలుకు ఎంపీ సీట్లను కైవసం చేసుకుంటుందని, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లతో పాటు ఇతర హిందీ బెల్టులోని కీలక రాష్ట్రాలలో తన ఆధిపత్యాన్ని కొనసాగించడమే కాకుండ తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సైతం అంచనాలకు మించి ఆశ్చర్య కరమైన ఫలితాలను సాధిస్తుందని ఘంటాపథంగా చెప్పడం గమనార్హం. తీరా ఓట్ల లెక్కింపు జరిగి వెల్లడయిన ఎగ్జాక్ట్ పోల్ ఫలితాలు... ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేసేశాయి ఈ అనూహ్యమైన అంచనాలకు కారణమేమిటి? అధికార పార్టీ బలప్రయోగమా? అంబానీ, ఆదానీల నిర్వహణలో కొనసాగుతున్న ప్రభుత్వ అనుకూల మీడియా సంస్థల అనుచిత ప్రభావమా? లేదా మనదేశాన్ని గత పదేళ్లుగా పాలించిన పాలకపక్ష నాయకుడు తమ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను సాధారణమైన మనిషిని కాదని, ఆ దేవుడి చేత దేవ లోకంలో ప్రత్యేకంగా సృష్టించబడి ఈ దేశ ప్రజల కోసం కానుకగా పంపించబడిన దేవదూతనని చేసిన ప్రకటన కారణమా? లేదా అయోధ్యలో బాల రాముడి ప్రతిష్టాపన కన్నా ముందూ, తర్వాత అయోధ్య నుండి దేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు పంపించిన అయోధ్య రాముడి అక్షింతలే నాలుగు వందలకు పైగా ఎంపీ స్థానాలను గెలిపిస్తాయనే అచంచల విశ్వాసమా? హిందువుల బంధువుగా తన విశ్వరూపాన్ని చూసి ముగ్ధుడైన పూరీ జగన్నాథుడే తనను అభిమానిస్తాడు, ఆరాధిస్తాడంటూ దేవుడి కన్న తానే గొప్ప వాడినంటూ దేశ ప్రధాని ఒడిశాలో ప్రజల ముందు తనను తాను ఆవిష్కరించుకున్న విభ్రాంతికర సంఘటన ప్రేరేపితమా? ప్రతిపక్ష పార్టీలకు ఓట్లేస్తే ఈ దేశ సంపదనంతా ముస్లింలకే పంచి పెడతాయనీ, చివరకు మీ భార్యల తాళి బొట్లను సైతం అమానవీయంగా లాక్కుంటాయంటూ చేసిన ఎన్నికల ప్రసంగాల్ని విశ్వసించి దేశంలోని హిందువులంతా కట్టగట్టుకుని బీజేపీని, దాని మిత్ర పక్షాలను అఖండమైన మెజార్టీతో గెలిపిస్తారనే అతి నమ్మకమా?)) ప్రధానంగా ఎన్డీఏ కూటమికి ఈసారి 400కి పైబడిన సీట్లు వస్తాయన్న ప్రచార ఊదర పట్ల కోట్ల సంఖ్యలో రిటైల్ మదుపరులు ఆకర్షితులై లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టారు. తదనంతరం 48 గంటల లోపే ఎగ్జిట్ పోల్ అంచనాలు తలకిందులై దేశ స్టాక్ మార్కెట్ కుప్పకూలటం జరిగింది.

# నల్సార్ లో విశిష్ట ప్రొఫెసర్ల నియామకం



**శామీర్ పేట, (గరుడ వార్త):** నల్సార్ విశ్వవిద్యాలయంలో విశిష్ట ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత గోపాలకృష్ణ గాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మెగాసేస్ అవార్డు గ్రహీత సాయినాధు లు నూతనంగా నియమితులయ్యారు. గోపాలకృష్ణ గాంధీ ఢిల్లీలోని అశోక విశ్వవిద్యాలయంలో రాజకీయాల విశిష్టత ప్రొఫెసర్, చరిత్ర, పౌర సమాజ జీవితంలో ఎంతో సేవలు చేశారు.

**గోపాలకృష్ణ గాంధీ....**

గోపాలకృష్ణ గాంధీ ప్రజాపాలనరంగంలోనూ, గవర్నర్ వంటి రాజ్యాంగ బాధ్యతల నిర్వహణలోనూ, దౌత్య రంగంలోనూ విశిష్ట ప్రతిభను కనబరిచారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక, లెసోతో లో భారతదేశానికి హై కమిషనర్ గా, నార్వే, ఐస్లాండ్ లలో భారత రాయబారిగా విశిష్ట సేవలందించారు. అతను 2004 నుంచి 2009 వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్ర గవర్నర్ గా సేవలందించారు. 2016లో మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు, 2016లో లాల్ బహదూర్ శాస్త్రి అవార్డు, 2018లో రాజీవ్ గాంధీ సద్భావన అవార్డులను అందుకున్నారు.

**సాయినాథ్....**

సాయినాథ్ ప్రొఫెసర్ పీపుల్స్ ఆర్కేవ్ ఆఫ్ రూరల్ ఇండియా వ్యవస్థాపకునిగా, ది హిందూ పత్రిక రూరల్ అఫైర్స్ ఎడిటర్ గా సేవలను అందించారు. ఈయన దాదాపు 30 ఏళ్లుగా గ్రామీణ రిపోర్టింగ్ లో ఉన్న ఒక ప్రముఖ పాత్రికేయునిగా పనిచేసే ప్రశంసలను అందుకున్నారు. 2021లో ఫుకుయోకా గ్రాండ్ ప్రైజ్, 2000 లలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గ్లోబల్ హ్యూమన్ రైట్స్ జర్నలిజం ప్రైస్, 2007 లో రామన్ మెగాసేస్ అవార్డు లతో పాటు 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ రిపోర్టింగ్ అవార్డులను అందుకున్నారు. ఇటీవల ది లాస్ట్ హీరోస్ అనే పుస్తకం భారత స్వాతంత్ర్య పోరాటంలో సైనికుల జీవితాలు, వారి సేవలను వివరిస్తుంది.



ఈ సందర్భంగా నల్సార్ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు మాట్లాడుతూ నల్సార్ విశ్వవిద్యాలయంలో విశిష్ట ప్రొఫెసర్ల ను గౌరవించి వారి విద్యాపరమైన సేవలను వినియోగించుకునేందుకే వీరిని నియమించినట్లు వివరించారు. వీరి నియామకం వలన విద్యాపర మేధావుల సేవలను విశ్వవిద్యాలయానికి, పౌర సమాజానికి అందుతాయని ఆయన వెల్లడించారు. మేము న్యాయవిద్య పరిధిని విస్తృతం చేసి న్యాయ విద్యార్థులకు, న్యాయ భావనకు సమాన హెూదా ఇచ్చిన అనేక ప్రధాన ప్రశ్నలను పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదిశగా ఈ మేధావులను విశిష్ట ప్రొఫెసర్లుగా నియమించి ఒక ముందడుగు వేసినట్లు ఆయన చెప్పారు. ప్రజా క్షేత్ర మేధావుల బోధనల ద్వారా చట్టమనేది కేవలం సాంకేతిక విషయ అధ్యయనం మాత్రమే కాదని విద్యార్థులకు, సామాజిక, ఆర్థిక న్యాయానికి లోతైన ప్రశ్నలను, అంశాలను అందించడం అవసరమని ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయానికి ఈ మేధావులు విద్యార్థులకు, చట్టానికి, సామాజిక ఆర్థిక న్యాయానికి మధ్య ఉండే సంబంధాన్ని వివరిస్తారని ఆయన తెలిపారు.

# బండి సంజయ్‌కు ఘనంగా స్వాగతం పలికిన బిజెపి నాయకులు అభిమానులు

**శామీర్ పేట, (గరుడ వార్త) :** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారి రాష్ట్రానికి వచ్చిన బండి సంజయ్ ను బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం శామీర్ పేట మండలం మురహరి పల్లి బృందావన్ గ్రాండ్ హెూటల్ వద్ద ఉమ్మడి శామీర్ పేట మండలం, మేడ్చల్ మండలం బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కేంద్ర ఓం శాఖ సహాయ మంత్రి గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కరీంనగర్ కు వెళ్తుండగా మార్గమధ్యంలోని శామీర్ పేట మండలంలో ఆయనకు మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు విక్రం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండలం, ఉమ్మడి శామీర్ పేట మండలంలోని బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రూ,2,500 పంపిణీకి సిద్ధం




**హైదరాబాద్, జూన్ :** ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలుపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ప్రతినెలా రూ. 2,500 అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ అంశంపై మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. అర్హులైన మహిళల ఖాతాల్లో ప్రతినెలా రూ. 2,500 చొప్పున త్వరలో జమ చేస్తామని ప్రకటించారు. ఇల్లు లేని పేదలకు సొంత ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు చెల్లిస్తామని తెలిపారు. విపక్షాల ఒత్తిడి నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. త్వరలో నిర్వహించబోయే కేబినెట్ భేటీలో కొన్ని పథకాలకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ప్రధానంగా రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే ఆరు గ్యారంటీల్లో మిగిలిన హామీలను కూడా అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మహిళలకు ప్రతినెలా రూ. 2,500 చెల్లించే అంశంపై కసరత్తు చేస్తున్నారు. ఇక మహిళలకు రూ. 2,500 అందించే పథకానికి కూడా తెల్ల రేషన్‌కార్డును తప్పనిసరి. ఇప్పటికే గ్యాస్, గృహజ్యోతి పథకాలను తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికే ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో త్వరలో అమలు చేసే ఆర్థికసాయం పథకం కూడా తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకే ఇవ్వనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మరోవైపు అర్హుల ఎంపిక విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థికసాయం, ఫింఛన్లు పొందని వారికి మాత్రమే ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూలై నుంచి దీనిని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

## పురోహితులకు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్:** ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన స్వంత నిధులతో 13 మంది పురోహితులకు, ఒకొక్కరికీ రూ 5000/- చొప్పున ఆర్థిక సహాయం అందించారు. స్వంత నిధులతో పురోహితులకు ప్రతి నెల 5000/- ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తున్న కార్యక్రమంలో భాగంగా, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గారు, ఈ రోజు తన క్యాంపు కార్యాలయంలో 13 పురోహితులకు, ఒక్కరికీ 5000/- చొప్పున అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆ బ్రాహ్మణులు ఎమ్మెల్యే కి వేదాశిర్వచనం చేశారు.

## వరద గ్రామాలలో కలెక్టర్ పర్యటన

**భద్రాచలం:** చర్ల మండలంలోని వరద ప్రభావిత గ్రామాలలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యటించారు. గ్రామంలో బడికి వెళ్ళని విద్యార్థులను తల్లిదండ్రులు బడికి పంపే ప్రయత్నం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రం ఏర్పాటు కోసం కలివేరు రైతు వేదికను పరిశీలించి అక్కడ అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. దేవరపల్లి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.

## ఓయూలో పాముల కలకలం

**హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలోని హాస్టల్ ల వద్ద పాములు సంచరించడం కలకలం రేపుతుంది. ఈ మేరకు ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీలోని న్యూ పీజీ హాస్టల్ వద్ద ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసే స్థలం వద్ద నాగుపాము కనిపించింది. గత వారం రోజుల క్రితం ఇదే ఓయూ లో ఎస్ బి ఐ బ్యాంక్ ఏటిఎం వద్ద పాము సంచరించడం జరిగింది. ఓయూ లో హాస్టల్ల వద్ద బ్యాంకుల వద్ద పాములు బహిరంగంగా సంచరించడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని నెలల కిందట ఉస్మానియా యూనివర్సిటీలో పాము కాటుతో ఓయూ ఉద్యోగి మరణించడం కూడా జరిగింది. వెంటనే ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

## సంగారెడ్డిలో రాహుల్ జన్మదిన వేడుకలు

**సంగారెడ్డి:** పదవులు ముఖ్యం కాదని ప్రజాసేవే తన ప్రధాన ఎజెండాగా పెట్టుకొని పార్టీ పదవిని సైతం వదిలి సామాన్య కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరులో కాంగ్రెస్ నేత నీలం మధు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ, నిర్మలారెడ్డి పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో రాహుల్ గాంధీ జన్మదిన కేకును మంత్రి సురేఖ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలు దేశవ్యాప్తంగా మంచి పేరు సాధించాయన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమికి మంచి సీట్లు వచ్చాయన్నారు. అందుకు రాహుల్ గాంధీ చేసిన జోడో యాత్ర ఎంతగానో ఉపయోగపడిందని మంత్రి అన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

**హైదరాబాద్:** తెలంగాణలో విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. మలక్ పేట కళ్యాణ్ నగర్ లో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ విద్య హక్కు చట్టం కింద ప్రతి ప్రైవేట్.కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలన్నారు. ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు ప్రోత్సహించడం వలన విద్యా వ్యాపారంగ మారిందని ఆరోపించారు. పిల్లలకు నాణ్యమైన గుణాత్మక విద్య అందించాల్సిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వాటి పేరుతో వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. నర్సరీ నుంచి మొదలుకొని పదో తరగతి వరకు వేలాది రూపాయలు ఫీజులు వాళ్లే నిర్ణయించి వసూలు చేయడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకోరావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే తరగతుల వారీగా ఫీజు నిర్ణయించి అట్టి ఫీజులను నోటీసు బోర్డుపై ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలో డ్రస్సులు, పుస్తకాలు అమ్మే విధానాన్ని పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు.

# విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు లోకేష్ శ్రీకారం

### - ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఉద్యోగాల పంటకు 100రోజుల యాక్షన్ ప్లాన్

### - బాధ్యతల స్వీకరణకు ముందునుంచే పని ప్రారంభించిన మిషన్ లోకేష్

**అమరావతి:** చేయాలనుకున్న పని పూర్తయ్యేవరకు పట్టువదలని విక్రమార్కుడిలా వెంటాడే తత్వాన్ని తాత ఎన్టీఆర్, తండ్రి చంద్రబాబునాయుడు నుంచి వారసత్వంగా పుణికిపుచ్చుకున్న యువనేత లోకేష్... రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రిగా బాధ్యతల స్వీకారానికి ముందే యాక్షన్ ప్లాన్ ప్రారంభించారు. ఎన్నికల్లో అప్రతిహత విజయం తర్వాత కాస్తంత రిలాక్స్ అవుదామన్న ఆలోచించకుండా తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రాష్ట్రప్రజల కోసం తొలిరోజు నుంచి పని మొదలు పెట్టారు. ప్రజాదర్బార్ తో ఓవైపు నిత్యం వందలాది ప్రజలు, కార్యకర్తలు, నాయకులను కలిసి వారి కష్టాల్లో పాలుపంచుకుంటూనే... హెచ్ఆర్ డి మంత్రిగా విద్యావ్యవస్థలో సమూల మార్పుల కోసం అధికారులతో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించారు. త్వరలోనే ఉపాధ్యాయ , విద్యార్థి సంఘాలు, తల్లి దండ్రులతో భేటీ అయి...వారి ఆశలు, ఆకాంక్షల మేరకు దీర్ఘకాలంగా విద్యావ్యవస్థలో వేళ్లూనుకున్న సమస్యలకు పరిష్కారం చూపాలని సంకల్పించారు. ఇందుకోసం వినూత్నమైన ఐడియాలజీతో ప్రత్యేకమైన కార్యాచరణ ప్రణాళికను సైతం సిద్ధం చేశారు. పేదబిడ్డలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం, విలువలతో కూడి విద్యనందించడం తప్ప సంబంధం లేని పనులను ఉపాధ్యాయులకు అప్పగించరాదన్నది ఆయన అంతరంగం. పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలికవసతుల కల్పన, ఏళ్లతరబడి హయ్యర్ ఎడ్యుకేషన్ లో పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, కోర్టుల్లో ఉన్న చిక్కుముడులను తొలగించి ఫ్యాకల్టీ రిక్రూట్ మెంట్ చేయడం, చిన్నారులకు దేశంలోనే నాణ్యమైన స్కూల్ కిట్స్ అందించి, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనేది యువనేత లోకేష్ ప్రధాన లక్ష్యాలు. వీటితోపాటు అయిదేళ్ల జగన్ పాలనలో ఉనికి కోల్పోయిన ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖలకు మళ్లీ గతవైభవం తెచ్చి, ఉద్యోగాల పంట పండించాలని 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించారు. అయిదేళ్లపాటు నిద్రావస్థలో ఉన్న యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసి తనదైన ముద్ర వేసేందుకు మంత్రి లోకేష్ సిద్ధమయ్యారు.

**లోకేష్ పట్టుబట్టాడంటే ఉడుంపట్టే**

ఎంత కష్టతరమైనా అనుకున్నది సాధించేవరకు వరకు నిద్రపోని మనస్థత్వం యువనేత నారా లోకేష్ సొంతం. ఈ అరుదైన లక్షణంతోనే కోట్లాదిమంది యువతలో ప్రత్యేకమైన స్టార్ ఇమేజ్ సంపాదించుకున్నారు. 2017-19 నడుమ కేవలం రెండేళ్లు మాత్రమే రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రిగా లోకేష్ పనిచేసినప్పటికీ... ఆయాశాఖల్లో గతంలో ఎవరూ సాధించనంత అభివృద్ధిచేశారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా రెండున్నరేళ్లలో 25వేల కి.మీ.ల సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి రికార్డు సృష్టించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిగా యువనేత లోకేష్ తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలకు గాను 2018లో ఆయనకు స్కోచ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. పరిపాలనలో ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినందుకు గాను డిజిటల్ లీడర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు సాధించారు. గ్రామీణ పాలనలో సాంకేతికతను విజయవంతంగా ఏకీకృతం చేయడంలో లోకేష్ చేసిన కృషిని గుర్తించి పంచాయత్ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం ఇన్నోవేషన్ అవార్డును అందజేసింది. కలాం ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్ అవార్డు కూడా లభించింది. 2018 సెప్టెంబర్ లో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (చిఇఈ) ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ వార్షిక సమావేశానికి భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించడానికి లోకేష్ ఆహ్వానం లభించింది. ఆ తర్వాత చిఇఈ నెట్‌వర్క్ ఆఫ్ గ్లోబల్ ఫ్యూచర్ కౌన్సిల్స్ (ఔఉఈఅ)కి నామినేట్ చేయబడిన ఏకైక భారతీయ రాజకీయ నాయకుడు యువనేత నారా లోకేష్. నవీనమైన, వేగవంతమైన ఆలోచనలతో రెండేళ్లలోనే హెచ్ సిఎల్, కాడ్యుయెంట్, పై కేర్, జోహో, టిసిఎల్, ఫ్యాక్స్ కాన్, సెల్ కాన్ వంటి ఎన్నో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించి ఆ రంగాల్లో వేలాదిమంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. తాజాగా రాష్ట్ర మానవవనరులు, ఐటి,ఎలక్ట్రానిక్స్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లోకేష్ సారథ్యంలో ఆయారంగాల్లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకునే అవకాశముంది.

## ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలపై జిఓ విడుదల

### - మంత్రి లోకేష్ మాట ఇచ్చిన 3రోజుల్లోనే అమలైన హామీ

**అమరావతి:** ఆయన ఇంకా రాష్ట్ర పరిపాలన కేంద్రం సచివాలయంలో అడుగు పెట్టలేదు. అయినా తాను చేపట్టిన విద్యాశాఖలో శరవేగంగా యాక్షన్ ప్లాన్ ప్రారంభించారు యువనేత నారా లోకేష్. ఈనెల 15వతేదీన ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్యాశాఖ అధికారులతో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ విద్యా శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే విద్యార్థులకు వైసిపి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వడం నిలిపివేసిందని తెలుసుకొని ఆశ్చర్యానికి గురయ్యారు. పుస్తకాలు లేకుండా పేదవిద్యార్థులు ఎలా చదువుతారని ఆ సమావేశంలోనే అధికారులను ప్రశ్నించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తక్షణమే ఇంటర్ విద్యార్థలకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ తోపాటు బ్యాక్ ప్యాక్ అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. జూలై 15 నాటికి పాఠ్యపుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలని లోకేష్ ఆదేశించడంతో అధికారులు ఆగమేగాలపై మంగళవారం జీవో ఎం.ఎస్. నెం.28ని విడుదల చేశారు. త్వరలోనే పుస్తకాలు పంపిణీ కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. సాంప్రదాయ రాజకీయ నాయకులకు భిన్నంగా లోకేష్ తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంగళగిరి ప్రజల కోసం తన ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు గత నాలుగురోజులుగా ఉండవల్లి నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

## అమృత లింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

**నెల్లూరు:** తోటపల్లి గూడూరు మండలం నక్కావారిపాళెంలో రథోత్సవం సందర్భంగా శ్రీ కామాక్షి సమేత శ్రీ అమృత లింగేశ్వర స్వామిని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జ్యోతి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా సోమిరెడ్డి ఘన విజయం సాధించిన నేపథ్యంలో మాచర్లవారిపాళెం టీడీపీ నేత పొన్నలూరు శివకోటారెడ్డి ఆధ్వర్యంలో 1200 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్ఆరు. శ్రీ కామాక్షి సమేత శ్రీ అమృత లింగేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని అయన ఆకాంక్షించారు.

## ఉత్తరాంధ్రలో భూకుంభకోణాలను వెలికితీస్తాం

### - భూముల రీసర్వే అస్తవ్యస్తం: మంత్రి అనగాని

**అమరావతి:** జగన్ ఏలుబడిలో విచ్చలవిడిగా జరిగిన భూ కుంభకోణాలపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ పాలనలో గాడితప్పిన రెవెన్యూ శాఖను సరిదిద్దుతామని, వంద రోజుల ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చేస్తామని తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా జరిగిన భూ కుంభ కోణాలపై విచారణ జరిపి, బాధ్యులపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎసైన్డ్ భూములను పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారని తెలిపారు. ఈ దందాలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చర్యలు ఉంటాయని, ఈ కుట్రలో అధికారులు ఉన్నా, రాజకీయ నేతలు ఉన్నా వదలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ పాలనలో గాడి తప్పిన రెవెన్యూ శాఖను వంద రోజుల ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చేస్తామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని భూ పరిపాలన శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో రాష్ట్రంలో రెవెన్యూ శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, భూముల రీ-సర్వే నిర్వహణ, పేదలకు ఎసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు, లబ్ధిదారులను మోసగించి జరిగిన కొనుగోళ్లు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు.

## ఈ నెల 21న శ్రీనగర్ కు ప్రధాని మోదీ

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ప్రధాని మోదీ జమ్ము కశ్మీర్ లో పర్యటిస్తారని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. శ్రీనగర్ లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానితో కలిసి దాదాపు 9000 మంది యోగా చేస్తారని పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్లోని 20 జిల్లాల ప్రజలను వర్చువల్ గా కనెక్ట్ చేస్తామని, దాదాపు 50,000 మందికి పైగా ప్రజలు కశ్మీర్ నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

## కేంద్ర బడ్జెట్ ఆధారంగా రాష్ట్ర బడ్జెట్


**హైదరాబాద్:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గాంధీభవన్లో మీడియాతో మాట్లాడారు. అప్పులు చేసి సంపద సృష్టిస్తాం, ఆ సంపద ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. మహిళా సంఘాలకు ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తాం. పార్టీలో కష్టపడి పనిచేసిన వారి సమాచారం అధిష్టానం వద్ద సమగ్రంగా ఉంది.. త్వరలోనే పనిచేసిన వారికి పదవులు అందుతాయి . రైతు రుణమాఫీకి పూర్తిగా మా ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎవరికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి కుల గణనా చేపట్టాలి తద్వారా దేశ సంపద వనరులు పంచబడాలి. పాలనలోను భాగస్వాములను చేయాలని మా డిమాండ్ అని అన్నారు. మేడిగడ్డలో మేట వేసిన ఇసుకను తొలగిస్తేనే మరమ్మతు పనులు ప్రారంభమవుతాయి. కేంద్ర బడ్జెట్ ఆధారంగా రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశపెడతాం విద్యుత్ కొనుగోళ్లపై న్యాయ విచారణ జరగాలని నిండు సభలో వాటి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి కోరారు.. న్యాయ విచారణ అంటే వారు ఎందుకు ఆందోళన చెందుతున్నారు అర్థం కావడం లేదు. ఇదేశ సంపద వనరులు దామాషా ప్రకారం పంచబడాలని రాహుల్ గాంధీ సుదీర్ఘ పాదయాత్ర చేశారు.. జనాభా దామాషా ప్రకారం సంపద పదవులు పంచాలని ఆయన ఎన్నికల ముందు కోరారు.. తెలంగాణ రాష్ట్రంలో రాహుల్ ఆలోచనలు అమలు చేస్తున్నాం. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తున్నాము వారి ఆలోచనలు ఆశయాలను ముందుకు తీసుకువెళ్తాం. దేశంలో కులగణను జరగాలని రాజీవ్ గాంధీ ఇచ్చిన పిలుపు విప్లవాత్మకమైనదని అన్నారు.

# గణితశాస్త్ర మేధావి బ్లేజ్ పాస్కల్....



అన్ని వయసులవారూ నేడు వాడే చిన్ని యంత్రం కాలుక్యులేటరు. కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు ... ఒకటేమిటి, లెక్కల్లో వచ్చే ప్రతి అంశాన్నీ అతివేగంగా పరిష్కరించి తెరమీద చూపిస్తుంది. ఇది విద్యార్థులకు, వ్యాపార సంస్థలకు, అనేకులకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది . దీన్ని కనుగొన్నశాస్త్రజ్ఞుడే బ్లెయిస్ పాస్కల్. పాస్కల్ (జూన్ 19, 1623 – ఆగష్టు 19, 1662) పాస్కల్ సూత్రం కనిపెట్టిన శాస్త్రవేత్త. ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రజ్ఞుడు, ఆధ్యాత్మిక తత్వవేత్త. బ్లేజ్ పాస్కల్ జూన్ 19, 1623 న ఫ్రాన్స్ యొక్క దక్షిణ – మధ్య ప్రాంతంలో ఆవర్న్ ప్రాంతంలో క్లెర్మాంట్‌లో జన్మించాడు. ఈ ప్రాంతం ఉంది. చిన్న వయసులోనే మరణించిన గణిత మహా మేధావి. ఫ్రాన్స్ కి చెందిన పాస్కల్ 7 యేండ్ల వయస్సు నుండే జామెట్రీ పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్య పరచే వాడట, 12 ఏళ్ళ వయస్సులోనే ఒక త్రిభుజం లోని మూడు కోణాల మొత్తం రెండు లంబకోణాల మొత్తానికి సమానంగా ఉంటుందనే సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టాడు. దీంతో ఈయన తండ్రి పాస్కల్ ను గణితం చదవడానికి ఎక్కువగా ఆసక్తి చూపాడు. అందరూ వేనోళ్ళ కొనియాడుతున్న "యూనివర్సల్ థీరం ఆఫ్ జామెట్రీ" పాస్కల్ రూపొందించినదే. పదహారేళ్ల వయసులో శంఖు పరిచ్ఛేదాల గురించి గొప్ప వ్యాసం రాసి మహామహా గణితవేత్తలే ముక్కున వేలు వేసుకునేట్టు చేశాడు పాస్కల్. ఆ కృషిలో బయట పడ్డదే పాస్కల్ సిద్ధాంతంగా తరువాత పేరు పొందింది. శంఖు పరిచ్ఛేదంలో అంతర్లి ఖితమైన ఏదైనా షడ్భుజి అభిముఖంగా ఉండే అంచులని కలుసుకునే వరకు పొడిగిస్తే, ఆ మూడు జతల అభిముఖ అంచులూ కలిసే మూడు ఖండన బిందువులూ ఒకే సరళరేఖలో ఉంటాయి. ఈ సిద్ధాంతం ప్రకారం... షడ్భుజి ఆరు భుజాలు (లేదా బాహువులు) గల బహుభుజి. ఆ భుజాలు సమానంగా ఉండనక్కర్లేదు. ఆరు భుజాలు ఉన్నాయి గనుక ఒకటోది, నాలుగోది అభిముఖంగా ఉంటాయి. అలాగే 2–5, 3–6 జతల భుజాలు కూడా అభిముఖంగా ఉంటాయి. ఈ అభిముఖంగా ఉండే భుజాల జతలని పొడిగిస్తే ఎక్కడో అక్కడ కలుస్తాయి. అలా వచ్చిన మూడు ఖండన బిందువులు ఒకే సరళ రేఖ మీద ఉంటాయని సిద్ధాంతం చెప్తుంది. పాస్కల్ సిద్ధాంతం 1639 లో ప్రచురించ బడింది, "ది కోనిక్స్ ఎస్సే". పాస్కల్ యొక్క ఆధ్యాత్మిక షడ్భుజి అని పిలుస్తారు. ఆయనకు 17 ఏళ్ళు వచ్చినప్పుడు ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డెస్ కార్టెస్ ఆయనలో ఒక గొప్ప మేధావిని చూసి ప్రశంసించాడు. అంతటి సమర్థుడు బ్లెయిసీ పాస్కల్. పాస్కల్ త్రిభుజం గురించి, దాని లక్షణాల గురించి 20ఏళ్ళ వయసుల ఓ పుస్తకం రాశాడు. పాస్కల్ జీవితమంతా ఫ్రాన్స్ లోనే గడిచింది. ఆయన తండ్రి అక్కౌంటెంట్ గా పని చేసేవాడు. రాత్రీ పగలూ లెక్కలు చేసేవాడు. తండ్రి పడుతున్న కష్టం చూసి పాస్కల్ లెక్కలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ కాలిక్యులేటింగ్ మెషిన్ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వంటివి చేసిపెట్టేది. ఆ మెషీన్ పాస్కల్ తండ్రికి ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం దానికయ్యే ఖర్చు ఎక్కువ కావటమే. అయినప్పటికీ చాలా కాలం తరువాత 1892 విల్లియం బరగ్స్ అనే అమెరికన్ పాస్కల్ నమూనాను ఆధారంగా చేసుకునే ఓ కాలిక్యులేటింగ్ మెషీన్ రూపొందించాడు. పాస్కల్ సూత్రం తెలియని విద్యార్థి ఉండరు. ద్రవ పదార్థంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్థం అన్ని పైపులకు సమానంగా విస్తరిస్తుంది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ ని, హైడ్రాలిక్ ప్రెస్ ను, హైడ్రాలిక్ బ్రేక్ ను రూపొందించటం జరిగింది. పాస్కల్ ఒక త్రిభుజాన్ని కూడా నిర్మించాడు. దీన్ని పాస్కల్ త్రిభుజం అంటారు. ఈ త్రిభుజం సహాయంతో ప్రాబబిలిటీ సమస్యలను సునాయాసంగా చేయవచ్చు. 1643 లో చేసిన గణిత శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి రూపొందించిన ప్రయోగాలను పునరావృతం చేశాడు. 1646 నుండి పాస్కల్ శూన్యతను తనిఖీ చేసే ఎంపికలను అధ్యయనం చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నాడు. 1653 లో పాస్కల్ వాతావరణ పీడనం గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. హైడ్రో స్టాటిక్స్ అంశం చాలా వివరణాత్మక రీతిలో అభివృద్ధి చేయబడిన మొదటి గ్రంథంగా ఇది పరిగణించ బడుతుంది. పాస్కల్ శాస్త్రవేత్త మాత్రమే కాదు. తత్వవేత్త కూడా. రచయిత కూడ, మతపరమైన పుస్తకాలను ఎన్నింటినో రాసాడు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటగ్రల్ కాలిక్యులస్ ు అంశాల మీద ఎన్నో విలువైన పరిశోధనలు చేశాడు. పాస్కల్ ప్రధాన రచనలు పాస్కల్ యొక్క సిద్ధాంతం, పాస్కలిన్, శూన్యత యొక్క ఉనికి లేదా వాతావరణ పీడనంపై ప్రయోగాలు. 1659 లో తీవ్ర అనారోగ్యం పాలై, పాస్కల్ 1662 లో కన్ను మూశాడు. మొదటి కాలిక్యులేటర్ నుండి మొదటి ప్రజా రవాణా సేవ వరకు ఆవిష్కరణలతో అతను చిన్న వయస్సు నుండే ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చాడు. ఆయన వెలువరించిన శాస్త్రీయ వాస్తవాలు మాత్రం ఎంతో మందికి మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

# సౌందర్య లహరి రచనా నేపథ్యం...!



"శంకారూపేణ మచ్చిత్తం పంకీకృతమభూద్యయా, కింకరీ యస్య సా మాయా శంకరాచార్యమాశ్రయే", "సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం, అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం" హిందూమత ఉద్ధారక త్రిమతాచార్యులలో ప్రథములు ఆది శంకర భగవ్పాదులు. శంకరాచార్యుల అనేక స్తోత్రాలలో శివస్తోత్రంగా శివానందలహరి, దేవీస్తోత్రంగా "సౌందర్య లహరి" చాలా ప్రసిద్ధాలు. ఆది శంకరాచార్యుడు జగన్మాతను స్తుతించిన అపూర్వ గ్రంథము సౌందర్య లహరి. త్రిపుర సుందరి అమ్మవారిని స్తుతించే స్తోత్రం గనుక ఇది సౌందర్య లహరి అనబడింది. అసామాన్యమైన వర్ణనా చాతుర్యంతో కూడిన ఒక దివ్య మహిమాన్విత స్తోత్రం. ఉపాసకులు దేవిని ఆరాధించడానికి ఉపయోగకరమైన అనేక మంత్రాలు నిక్షిప్తమైన మంత్రమాల. లహరి అంటే ప్రవాహగుణం కలది అని అర్థం. సౌందర్య లహరి అంటే ప్రవహించే సౌందర్యం అని అర్థం. సర్వ జగత్తుకీ శక్తినందించే కాంతి తత్వం అమ్మ. బ్రహ్మాండాలకు ఆవల ప్రకాశిస్తూ, సకల భువనాలపై నివసిస్తున్న అందరిపై వెలుగును ప్రసరిస్తుంది జగజ్జనని. జ్యేష్ఠ శుద్ధ ద్వాదశినాడు ఆదిశంకరులు కైలాస గమనం చేసినట్లు శంకర విజయం చెబుతోంది. సౌందర్య లహరి స్తోత్రావిర్భావం గురించి ఒక గాథ ప్రచారంలో ఉంది. ఆదిశంకరులు ఒకమారు స్వయంగా కైలాసం వెళ్ళారట. అక్కడ వ్రాసి ఉన్న ఈ శ్లోకాన్ని చదువుతుండగా వినాయకుడు... అది మానవులకు అందరాని అత్యంత గుహ్య విద్య గనుక దానిని క్రింది నుండి చెరిపి వేశాడట. . అలా శంకరులు మొదటి 40 శ్లోకాలు మాత్రమే చదివారు. వాటికి తోడు మరొక 60 శ్లోకాలు శంకరాచార్యులు రచించారు. ఆ వంద శ్లోకాలు కలిపి సౌందర్య లహరిగా ప్రసిద్ధమయ్యాయి. ఇదే కథకు వివిధ రూపాంతరాలున్నాయి. ఆదిశంకరుడు శివపార్వతులను పూజించడానికి కైలాసాన్ని సందర్శించగా, కైలాస నాథుడు అతనికి దేవి గురించి వివరించే 100 శ్లోకాలతో కూడిన రాత ప్రతిని అతనికి బహుమతిగా ఇచ్చాడు. శంకరుడు కైలాసాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా నందీశ్వరుడు దారిలో ఆపి, వ్రాతప్రతిని లాక్కొని, రెండుగా చించి, ఒక భాగాన్ని తీసుకొని మరొక భాగాన్ని శంకరునికి ఇచ్చాడు. శంకరుడు, శివుని వద్దకు పరిగెత్తి, జరిగిన సంఘటనను అతనికి వివరించాడు. శివుడు చిరునవ్వుతో, 100 శ్లోకాలలో మొదటి భాగమైన 41 శ్లోకాలను తన వద్ద ఉంచుకోమని ఆజ్ఞాపించాడు, ఆపై దేవిని స్తుతిస్తూ అదనంగా 59 శ్లోకాలు రాయమని చెప్పాడు. 1%–%41 శ్లోకాలు తంత్రం , యంత్రం, వివిధ శక్తివంతమైన మంత్రాల గురించి ఉంటాయి . మిగిలిన శ్లోకాలు 42%–%100 ఆదిశంకరులు స్వయంగా స్వరపరిచారు, ఇది ప్రధానంగా అమ్మవారి రూపాన్ని దృష్టిలో ఉంచుతుంది. ఇది ఏమయినా మొదటి 40 శ్లోకాలు యంత్ర తంత్ర విధాన రహస్యాలు తెలుపుతుండగా తరువాతివి శ్రీమాత యొక్క సౌందర్యాన్ని కీర్తిస్తున్నాయి. పరతత్వ నిరూపణ చేస్తూ, శ్రీవిద్యా రహస్యాలను బోధించే సౌందర్య లహరి పై ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. శంకర వాఙ్మయం మధురమైనది, శక్తివంతమైనది. ఎంత మధురమైనదో అంతే గంభీరమైనది. శాశ్వతత్వాన్ని సాధించుకున్నది. మంత్ర తంత్ర యంత్ర రహస్యాలకు అటపట్టు అయిన గౌడపాదుల సుభగోదయ స్తుతి ఆధారంగా సౌందర్యలహరిని శంకరులు రచించారు. దీనిని కైలాసం నుంచి తీసుకువచ్చారని కూడా విశ్వసిస్తారు. అనేక ఉపాసనా మర్మాలు, వేదాంత రహస్యాలు సౌందర్యలహరిలో శంకరులు నిక్షిప్తం చేశారు. అందుకే శంకరుల కవితను మార్మీ సుకవిత్వం అన్నారు. లలితా సహస్రనామానికి వ్యాఖ్యానాన్ని కవితాత్మకంగా చెప్పినదే సౌందర్యలహరీ స్తోత్రం అనిపిస్తుంది. ఇది అనుభూతి కవిత్వం. ఇక సౌందర్య లహరిలో ప్రతిపదం మంత్రమయమే. అసలు సౌందర్య లహరి అనే పేరే ఒక మంత్రం 'సౌః – లం – హ్రీం' అనేవి మూడూ అమ్మవారి బీజాక్షరాలే. అందుకే సౌందర్య లహరి అనే పేరు తలచుకుంటేనే మంత్రం జపించిన ఫలితం కలుగుతుంది. సౌందర్యలహరీ స్తోత్రాన్ని వ్యాఖ్యాతలు రెండు భాగాలుగా విభజించారు. తత్వ రహస్యాలు, కుండలినీ యోగాలు, ఉపాసన మర్మాలు కలిగిన మొదటి 41 శ్లోకాలను ఆనంద లహరి అని, చివరి 59 శ్లోకాలను సౌందర్య లహరి అన్నారు. మొదటి భాగంలో 'చిదానంద లహరీం, అంటూ రెండు సార్లు లహరి శబ్దం కనిపిస్తోంది. రెండో భాగంలోనే సౌందర్య లహరి అనే మాట వస్తోంది. తొలి భాగంలో లోతైన విషయాలెన్నో ఉంటాయి. ఇవి జ్ఞానయోగాన్నిస్తాయి. రెండో భాగంలో అమ్మవారి శిరస్సు మొదలుకుని పాదాల వరకూ రూపవర్ణన చేస్తారు. ఈ రూప వర్ణన సామాన్యునికి సైతం తేటతెల్లంగా బోధపడుతుంది. ధ్యానానికి అనువుగా ఉంటుంది. చదువుతుంటే అమ్మవారి రూపం కళ్లముందు కదలాడుతుంది. శివుడంటే ఆనందం. అమ్మంటే సౌందర్యం అంటే అందం అని అందరం చెప్పుకునే అర్థం.

# నిరుద్యోగ సమస్యకు పరిష్కారమేదీ...?



మన దేశంలో నిరుద్యోగ సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. ప్రతి సర్వేలో మంచి జీతంతో కూడిన సురక్షితమైన ఉద్యోగాలు లేకపోవడమే తమ సమస్య అని దేశ ప్రజలు చెబుతున్నారు. భారతీయ జనాభాలో మూడింట రెండొంతుల మంది పని చేసే వయస్సులో ఉన్నారు. అంటే, వారు 15–65 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. పని చేసే వయస్సు గల వ్యక్తుల ఈ నిష్పత్తి ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ, పని చేసే వయస్సులో ఎక్కువ మంది వ్యక్తులు ఎటువంటి వేతనంతో కూడిన పని దొరకక వారి శక్తి పూర్తిగా వృధా అవుతోంది. వీరిని నిరుద్యోగులుగా పరిగణిస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీగా ఉన్నంత కాలం నిరుద్యోగానికి పరిష్కారం లేదు. సమస్యకు పరిష్కారం లేకపోవడంతో, రాజకీయ పార్టీలు కుల ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాల కోసం ప్రజల మధ్య పోటీని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాల విషయంలో నిరుద్యోగ యువత తమలో తాము పోట్లాడుకునేలా చేస్తున్నారు. సమస్య మూలాన్ని తొలగించకుండా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదు. యువతకు నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి సంవత్సరం దాదాపు 50 లక్షల మంది యువత శ్రామికశక్తిలో చేరుతున్నారు కానీ వారిలో చాలా మందికి వేతనంతో కూడిన పని దొరకడం లేదు. 2024 జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించిన తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం దేశంలో 15–29 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి ఆరుగురిలో ఒకరు నిరుద్యోగులుగా ఉన్నారు. నిరుద్యోగులందరిలో సెకండరీ పాఠశాల పూర్తి చేసిన యువత నిష్పత్తి 2000లో 54% ఉండగా, అది 2022 నాటికి 66%కి పెరిగింది. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం క్లరికల్ ఉద్యోగాల్లో కొన్ని వందల ఖాళీలను భర్తీ చేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించినప్పుడల్లా వేలాది మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పీహెచ్‌డీలు కూడా ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటారు. అధిక అర్హత కలిగిన యువతలో చాలా తక్కువ మందికి ప్రైవేట్ కంపెనీలలో రెగ్యులర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. మరోవైపున లక్షలాది మంది యువత రైల్వేలో లేదా ఇతర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగం కోసం, ఒకదాని తర్వాత మరొకటి అర్హత పరీక్షలకు సిద్ధమవుతూ, రాస్తూ వృథాగా సంవత్సరాలు గడుపుతున్నారు. ఏటా ఉద్యోగాల సృష్టి కంటే తగ్గుతున్నవే ఎక్కువ. ఈ ఏడాది ఐఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు కూడా ఉద్యోగం కోసం కష్టపడుతున్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగాల పరిమాణం నిలిచిపోవడమే కాకుండా, ఉద్యోగాల నాణ్యత క్షీణిస్తోంది. ఎక్కువ మంది కార్మికులు ఎటువంటి సామాజిక భద్రత లేకుండా ఎక్కువ గంటలు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయవలసి వస్తుంది.

# ప్రపంచ వ్యాప్తంగా 12 వేలకు పైగా అణ్వస్త్రాలు...



ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలా దేశాలు రక్షణ కోసం అణ్వస్త్రాలనే నమ్ముకున్నాయని సిప్రి నివేదిక తెలిపింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా అణ్వాయుధాలనే నమ్ముకున్నాయని స్టాక్ హెూం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్తెలిపింది. దీనిపై సిప్రి ఇయర్ బుక్ 2024ని విడుదల చేసింది. అణ్వస్త్ర సామర్థ్యమున్న తొమ్మిది దేశాలు తమ ఆయుధాలను మరింత ఆధునికీకరిస్తున్నాయని సిప్రి నివేదిక తెలిపింది. మొత్తంగా 2024 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 12,121 అణు ఆయుధాలు ఉన్నాయని తెలిపింది. వీటిలో 9,585 ఆయుధాలు సైనిక నిల్వ కేంద్రాల్లో ఉన్నట్లు తెలిపింది. ఇవన్నీ దాదాపుగా అందుబాటులో ఉన్నట్లే. దాదాపు 3,904 అస్త్రాలు క్షిపణులు, యుద్ధ విమానాల్లో అమర్చి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే భారత్ చాలా స్వల్ప స్థాయిలో అణ్వాయుధాలను పెంచుకున్నట్లు సిప్రి తెలిపింది. భారత్, పాకిస్థాన్ ఇరు దేశాలు కొత్త అణ్వస్త్ర ప్రయోగ వ్యవస్థల అభివృద్ధిని కొనసాగించాయని పేర్కొంది. భారత్ మాత్రం చైనాలో ఏ మూలకైనా ప్రయోగించగల ఆయుధాలపై దృష్టి సారించిందని పేర్కొంది. పాక్ ప్రధానంగా భారత్‌ను నిలువరించేందుకు వీలుగా అణ్వస్త్ర విధానాన్ని కొనసాగిస్తోందని తెలిపింది.

## గుండెపోటుతో బిజెపి నేత మృతి...!

**కర్నాటక :** కర్నాటక బిజెపి నేత, మాజీ ఎమ్మెల్సీ ఎం.బి.భానుప్రకాష్ గుండెపోటుతో మరణించారు. శనివారం కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. పెట్రోల్ పై 29.84 శాతం, డీజిల్ పై 18.44 శాతం అమ్మకం పన్ను పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ రూ.3, డీజిల్ రూ.3.05 చొప్పున పెరిగింది. పెంచిన ధరలపై బిజెపి సోమవారం రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టింది. అయితే ఈ నిరసనల్లో పాల్గొన్న కర్నాటక బిజెపి నేత, మాజీ ఎమ్మెల్సీ ఎం.బి.భానుప్రకాష్ గుండెపోటుతో మరణించారు. శివమొగ్గలో బిజెపి చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. వెంటనే కారులో ఆయనను ఎక్కిస్తుండగా కుప్పకూలిపోయారు. సమీప ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు కాపాడలేకపోయినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. 69 ఏళ్ల భానుప్రకాష్ గతంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడుగా సేవలందించారు.



## మోడీ సర్కారు వైఫల్యమే: ఖర్గే



**న్యూఢిల్లీ :** గత పదేళ్లలో మోడీ ప్రభుత్వ హయాంలో 117 రైల్వే ప్రమాదాలు జరిగాయని, వీటికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో రైలు ప్రమాదంలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడంపై సంతాపం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులు మరోవైపు కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపైనా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. రైలు ప్రమాదానికి మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అధ్యక్షులు, రైల్వే శాఖ మాజీ మంత్రి మల్లిఖార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. పూర్తిగా నిర్వహణ లోపంతోనే రైలు ప్రమాదం జరిగిందని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో మోడీ ప్రభుత్వం రైల్వే శాఖను పూర్తిగా దుర్వినియోగం చేసిందని పేర్కొంటూ ఖర్గే ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'బాధ్యత గల ప్రతిపక్షంగా.. మోడీ ప్రభుత్వం రైల్వే మంత్రిత్వ శాఖను 'కెమెరాతో నడిచే' స్వీయ ప్రచార వేదికగా ఎలా మార్చివేసిందో వెల్లడించడం మా కర్తవ్యం. ఈరోజు జరిగిన దుర్ఘటన ఇలాంటి కఠోర నిజాలను మరోసారి గుర్తు చేసింది. భారతీయ రైల్వేలను నేరపూరితంగా వదిలివేసినందుకు మోడీ ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తాం' అని కాంగ్రెస్ అధ్యక్షులు తెలిపారు. మోడీ ప్రభుత్వ తప్పుడు నిర్వహణకు, నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఫలితంగానే గత పదేళ్లలో రైల్వే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. 'బాధ్యత గల ప్రతిపక్షంగా ఈ తీవ్రమైన నిర్లక్ష్యాన్ని మేం ప్రశ్నిస్తూనే ఉంటాం, ఈ ప్రమాదాలకు మోడీ ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తామని' రాహుల్ గాంధీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ కూడా ఈ ప్రమాదంపై తీవ్రంగా స్పందించారు. ఎక్స్‌లో చేసిన ట్వీట్‌లో 'ఘోరమైన బాలాసోర్ ప్రమాదం తరువాత కూడా రైల్వే శాఖలో ఎటువంటి జవాబుదారీతనం లేదు, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నిరోధించడానికి ఎటువంటి నివారణ చర్యలు తీసుకోకపోవడంతోనే తాజా విషాదం చోటు చేసుకుంది.


## జి-7 డిక్లరేషన్ అబద్ధాలపుట్ట......! తీవ్రంగా స్పందించిన చైనా

**బీజింగ్ :** జి-7 సదస్సు విడుదల చేసిన డిక్లరేషన్ పూర్తిగా అబద్ధాల పుట్ట అని, అహంకారంతో, పక్షపాతంతో కూడినదని చైనా విమర్శించింది. గత వారం ఇటలీలో సమావేశమైన జి 7 నేతలు చైనాతో వాణిజ్య సంబంధాలపై, ఉక్రెయిన్ విషయంలో ఉద్రిక్తతలపై, దక్షిణ చైనా సముద్ర జలాలపై ప్రధానంగా చర్చించి, డిక్లరేషన్ విడుదల చేశారు. అనేక విషయాల్లో చైనాపై తీవ్రంగా ఆరోపణలు చేసిన నేపథ్యంలో చైనా స్పందన వెలువడింది. రష్యాకు ఆయుధాల విడి భాగాలను పంపడాన్ని చైనా ఆపాలని కూడా వారు వ్యాఖ్యలు చేశారు. వీటిపై సోమవారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్‌జియాన్ మాట్లాడుతూ, చైనాపై అపవాదులు వేస్తూ, జి 7 సదస్సు దాడి చేసిందని విమర్శించారు. వారు చేసిన ఆరోపణలకు ఎలాంటి చట్టబద్ధమైన ప్రాతిపదిక లేదని, వాస్తవాలు లేవని, పైగా నైతికంగా సమర్ధనీయం కావని పేర్కొన్నారు. పైగా పూర్తి అహంకారం, పక్షపాతం, అసత్యాలతో కూడి వారి డిక్లరేషన్ వుందన్నారు. గతేడాది జపాన్‌లో జరిగిన సదస్సు సందర్భంగా ఉపయోగించిన పదజాలం కన్నా పరుషమైన పదజాలంతో ఈసారి జి 7 డిక్లరేషన్





వుంది. దక్షిణ చైనా సముద్రంలో చైనా సైనికీకరణను, బలవంతపు, బెదిరింపు చర్యలను, కార్యకలాపాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రమాదకరమైన రీతిలో సామర్ధ్యానికి మించి వ్యవహరిస్తోందని డిక్లరేషన్ విమర్శించింది. దానిపై లిన్ స్పందిస్తూ, మితిమీరిన సామర్ధ్యమంటూ జి 7 చేసిన ఊహాగానాలు పూర్తిగా వాస్తవాలను, ఆర్థిక చట్టాలను పక్కదారి పట్టించేలా వున్నాయని విమర్శించారు. రక్షణవాదం కొరకు సాకులు సృష్టిస్తున్నారన్నారు.

## కిమ్‌తో భేటీ నేపథ్యంలో పుతిన్ కీలక వ్యాఖ్యలు



ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ను రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలతో ముంచెత్తారు. మంగళ, బుధ వారాల్లో ఉత్తరకొరియాలో పుతిన్ పర్యటించనున్నారు. ఇలాంటి టైంలో 'కొరియన్ న్యూస్ ఏజెన్సీ'కి కథనం రాశారు. ఉక్రెయిన్ తో యుద్ధంలో నార్త్ కొరియా తమకు మద్దతుగా నిలుస్తోందన్నారు. చాలా విషయాల్లో పరస్పర సహకారంతో ముందుకు వెళున్నామని పుతిన్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో ఉమ్మడి వైఖరి అనుసరిస్తున్నామని గుర్తుచేశారు. ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. పశ్చిమ దేశాల ప్రభావం పడకుండా చెల్లింపుల వ్యవస్థలను సైతం అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పర్యటకం, సంస్కృతి, విద్య రంగాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేస్తామన్నారు. అణ్వాయుధాల అభివృద్ధి గురించి నార్త్ కొరియాపై, ఉక్రెయిన్ తో యుద్ధం వల్ల రష్యాపై అమెరికా ఆంక్షలు విధించింది. అమెరికా విధించిన ఆంక్షలను కలిసికట్టుగా ఎదుర్కొంటామని పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. ఇకపోతే, పుతిన్ పర్యటనలో ఇరు దేశాధినేతలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉంది. భద్రత, రక్షణకు సంబంధించిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం' కూడా అందులో ఉందని రష్యన్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. రక్షణపరమైన సహకారంపైనే ఇరు దేశాల ఒప్పందాలు జరగనున్నాయి.

## ఇజ్రాయెల్ వార్ కేబినెట్ రద్దు.. నెతన్యాహు కీలక నిర్ణయం



గాజాలో యుద్ధానికి నాయకత్వం వహించే ఇజ్రాయెల్ వార్ కేబినెట్‌ను ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు రద్దు చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ అధికారులు సోమవారం ప్రకటించారు.కేబినెట్ సమావేశం అనంతరం నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కేబినెట్ సభ్యుడు బెన్నీ గాంట్జ్ ఇటీవలే రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గాన్నే రద్దు చేయడం గమనార్హం. కేబినెట్ రద్దు చేయడానికి గల కారణాలను వెల్లడించలేదు. అయితే గాంట్జ్ రాజీనామా తర్వాత ఇజ్రాయెల్ సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వాములు కొత్త యుద్ధ కేబినెట్‌ను ఏర్పాటు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఇందులో ప్రస్తుతం ఇజ్రాయెల్ అంతర్గత భద్రతా మంత్రిగా ఉన్న జివిర్‌ను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే నెతన్యాహు మంత్రి వర్గాన్ని తొలగించినట్టు తెలుస్తోంది. కాగా, 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పై హమాస్ దాడి తర్వాత అదే నెల 11వ తేదీన నెతన్యాహు ఆరుగురు సభ్యులతో కూడిన యుద్ధ మంత్రివర్గం ఏర్పాటు చేశారు. ఇందులో గాంట్జ్, నెతన్యాహు, గాలంట్, రాన్ డెర్మెర్ లతో పాటు మరో ముగ్గురు సభ్యులు ఉన్నారు. హమాస్‌తో యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ భద్రతకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ కేబినెట్ కీలక పాత్ర పోషించింది. అయితే యుద్ధ మంత్రివర్గంలో చాలా కాలంగా భిన్నాభిప్రాయాలు ఉన్నట్టు పలు కథనాలు వెలువడుతున్నాయి.

## సికిల్ సెల్ కోరల్లో వనవాసీలు..!

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల ఆఫ్రికన్, మెడిటెరేనియన్, మిడిల్ ఈస్ట్, సౌత్ ఆఫ్రికన్, భారత్ లాంటి ఏసియన్ దేశాల అమాయక ప్రజలు, ముఖ్యంగా గిరిజనలు సికిల్ సెల్ వ్యాధితో సతమతమవుతున్నారు. ప్రధాన ప్రజారోగ్య సమస్య పట్ల సరైన అవగాహన, చికిత్స, పరిశోధనలు, వ్యాధిగ్రస్తులకు బాసటగా నిలవడం లాంటివి కల్పించి వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చనే అభిప్రాయాలను వైద్య నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. జన్యుపరమైన ఎర్ర రక్త కణాల రుగ్మతను 'సికిల్ సెల్ వ్యాధి లేదా కొడవలి కణ రక్తహీనత లేదా సికిల్ సెల్ ఎనీమియా' అని పిలుస్తారు. శరీర కణజాలానికి ప్రాణవాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్త కణాలు జన్యు సంబంధ కారణంగా అసాధారణ కొడవలి లేదా సికిల్ ఆకారంలోకి మారడంతో రక్తనాళాలు మూసుకొని పోయి ప్రమాదకర ఆరోగ్య సమస్యలు బయట పడడం చూస్తున్నాం. సికిల్ సెల్ ఉన్న వారిలో ఒక జన్యువు కొడవలి లేదా చంద్రవంక ఆకారంలో, మరొకటి సాధారణ ఆకారంలో ఉన్నట్లయితే వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. వీరికి ఎలాంటి అనారోగ్యాలు కలగవు. కాని ఇలాంటి లక్షణాలు కలిగిన ఇద్దరికీ వివాహం అయినపుడు జన్మించే సంతానంలో రెండు జన్యువులా కొడవలి ఆకారంలోకి మారడంతో ప్రమాదకర అనారోగ్య సమస్యలు ప్రారంభమవుతాయి. పుట్టిన పిల్లలకు 5-6 నెలల వరకు ఈ వ్యాధి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగి కొద్ది వ్యాధి లక్షణాలు బయట పడతాయి. సాధారణ రక్తనాళాల జీవితకాలం 120 రోజుల వరకు ఉంటే సికిల్ రక్త కణాల జీవితకాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటుంది. సికిల్ ఆకార రక్తకణాలు నశించినంత వేగంగా కొత్త ఎర్ర కణాలు ఉత్పత్తి కాకపోవడంతో వీరికి తీవ్రమైన రక్తహీనత కలిగి కుటుంబాలు చితికి పోవడం గమనిస్తున్నాం. సికిల్ సెల్ క్యారియర్స్ మధ్య వివాహాలు జరుగకుండా జాగ్రత్త పడడం దీనికి సరైన మార్గమని అవగాహన కలిపించడం కనీస అవసరంగా మారింది. సికిల్ సెల్స్ కొడవలి ఆకారంలో ఉండడంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించకపోవడం, తగు చికిత్స లేదా మందులు లేకపోవడం వల్ల శరీర కణజాలాలకు ప్రాణవాయువు సరఫరా తగ్గిపోతూ 15 ఏండ్ల లోపు చనిపోవడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ వ్యాధి తీవ్రతను గుర్తించిన ఐరాస సర్వసభ్య సమావేశం 2008లో తీసుకున్న నిర్ణయం ప్రకారం 2009 నుంచి ప్రతి ఏట 19 జూన్న "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే)" పాటిస్తూ సామాన్య ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ప్రతి ఏట మిలియన్ల ప్రజలు ఈ వ్యాధి బారిన పడడమే కాకుండా లక్షల మంది అకాల మరణాలు పొందడం అనాదిగా జరుగుతోంది. ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం-2024 థీమ్‌గా 'పురోగతి ఆశిస్తూ, ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ వ్యాధిగ్రస్థుల చికిత్స, సురక్ష' అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. సికిల్ సెల్ వ్యాధి లక్షణాల్లో కాళ్లు/చేతులు/వేళ్లు/ప్లీహం వాపుతో వర్కర్లు తిరగడం, దీర్ఘకాలం కామెర్లు, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు, మైకం, స్ట్రోక్, కీళ్ల నొప్పులు, లెగ్ అల్సర్స్, పల్మనరీ హైపర్‌టెన్షన్, పిత్తాశయ రాళ్ళు, రక్తహీనతతో శరీరం పాలిపోవడం లాంటి ప్రధానమైనవిగా గుర్తించబడినవి. ఈ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే (పది రూపాయల ఖర్చు మాత్రమే) ఏర్పాట్లు ఉన్నాయి. సికిల్ సెల్ రోగానికి సరైన చికిత్సల లేనందున క్యారియర్లను గుర్తించి వారి మధ్య పెళ్లిళు జరుగకుండా చూడడం, అందుబాటులో ఉన్న మందులతో జీవితకాలాన్ని పెంచడం ఉత్తమ మార్గాలని తెలుస్తున్నది. ఇది ప్రమాదకర అనువంశిక వ్యాధి అయినందున నివారణోపాయాలే ప్రధానమని గమనించాలి. ఒకవేళ క్యారియర్ల మధ్య వివాహాలు జరిగితే వారి సంతానానికి తప్పనిసరిగా వారసత్వంగా వ్యాధిగా సికిల్ సెల్ రక్తహీనత వస్తుంది. కాలేయం, గుండె, మూత్రపిండాలు, పిత్తాశయం, కళ్ళు, ఎముకలు, కీళ్ళు మొదలగు ప్రధాన అవయవాలు కూడా ఈ వ్యాధితో దెబ్బతింటాయి. భారత్‌లో సికిల్ సెల్ వ్యాధి దాదాపు 20 మిలియన్ల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఈశాన్య రాష్ట్రాల్లో 18 శాతం వరకు, పశ్చిమ భారతంలో 33 శాతం వరకు, కేంద్ర భారతంలో 44 శాతం వరకు, దక్షిణ భారతంలో 40 శాతం వరకు సికిల్ సెల్ వ్యాధి విస్తరించా ఉంది. ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక ప్రాజెక్టులు, పరిశోధనాలయాలు కూడా చేపట్టారు. సికిల్ సెల్ కట్టడికి ప్రజలకు స్క్రీనింగ్‌పరీక్షలు నిర్వహించడం, క్యారియర్ల మధ్య పెళ్లిళ్లు జరుగకుండా అవగాహన కల్పించడం, వ్యాధితో బాధపడుతున్న రోగులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించడం నిరంతరం జరగాలి. టీకాలు వేయించడం, యాంటీబయాటిక్స్, అధిక ద్రవం తీసుకోవడం, నొప్పి మందులు వాడడం, ఎముకల మజ్జ కణాల మార్పిడి, రక్త మార్పిడి లాంటి ఉపశమన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 10 లక్షల గిరిజన జనాభాలో కనీసం 10 శాతం మందికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు, ప్రాణాలు కోల్పోతున్న అభాగ్యుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు తేలింది. వ్యాధి ప్రబలిన ప్రదేశాల జనాభా అందరికీ రక్త/మూత్ర పరీక్షలు నిర్వహించడం, ఛాతీ ఎక్స్-రే తీయడం, నొప్పి తగ్గించే పేయిన్ కిల్లర్స్ వాడడం, ఎముకల మజ్జ/రక్త మార్పిడి చేయడం, సికిల్ సెల్ క్యారియర్ల మధ్య వివాహాలు జరుగకుండా నిరోధించడం, వ్యాధి పూర్వాపరాల పట్ల అవగాహన కల్పించడం, చికిత్సల కేంద్రాలను అందుబాటులో ఉంచడం, పరిశోధనలు కొనసాగించడం లాంటి చర్యలను తీసుకుంటూ సికిల్ సెల్ వ్యాధి లేని ప్రపంచాన్ని నిర్మిద్దాం, కొడవలి కణ రుగ్మత బారిన పడిన అమాయక, నిరుపేద గిరిజనులకు బాసటగా నిలుద్దాం.

# గొడ్డు కారం తినేవారికి గుడ్ న్యూస్..!



మనం ప్రతి రోజు వండుకునే వంటల్లో కారం తప్పనిసరిగా వేస్తాం. కూరల్లో సరిగ్గా కారం పడకపోతే ముద్ద దిగదు. కొంత మంది పచ్చి మిరపకాయలు వాడితే.. మరికొంత మంది ఎండు కారం వాడుతూ ఉంటారు. కొంత మంది కారం ఎక్కువగా తింటారు. మరి కొంత మంది కారం అంటే ఇష్టపడరు. అయితే ఇప్పుడు చెప్పే విషయాలను తెలుసుకుంటే కారం తినని వారు కూడా కారాన్ని ఇష్టంగా తింటారు. ఇటీవల రకరకాల అనారోగ్యాల పేరుతో కారానికి దూరంగా ఉంటున్నారు చాలా మంది. కానీ తగినంత మోతాదులో కారాన్ని ఆహారంలో చేర్చుకోవాలని అంటున్నారు నిపుణులు ఎందుకంటే కారంలో మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఆ ప్రయోజనాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.అల్సర్ ఉన్నవారు ఎక్కువ కారం తినకూడదు అని అంటూ ఉంటారు. అయితే ఇటీవల జరిగిన పరిశోధనల్లో కారంలో ఉండే కొన్ని సమ్మేళనాలు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయని తేలింది. రక్త ప్రసరణ మెరుగు అయ్యి గుండె సమస్యలు రావు. కీళ్ల నొప్పులు,తలనొప్పి ఉన్నవారు కారం తింటే మంచి ఉపశమనం కలుగుతుంది. అంతేకాక దగ్గు,జలుబు ఉన్నవారు కారం తింటే తొందరగా ఉపశమనం కలుగుతుంది. ఎండు మిరపకాయల పొడి (కారం)లో ఉండే అనేక రకాల సమ్మేళనాలు ఊపిరితిత్తుల క్యాన్సర్ రాకుండా కాపాడతాయని ఇటీవల జరిగిన పరిశోధనల్లో తేలింది.మిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ అనబడే సమ్మేళనం బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కారం తినడం వల్ల వచ్చే చెమట కారణంగా శరీరంలో ఉన్న కొవ్వు కరిగిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కారం తిన్న తర్వాత శరీర మెటబాలిక్ రేటు దాదాపు 8 శాతం వరకు పెరుగుతుందట. దీంతో కొవ్వు కరుగుతుందని అంటున్నారు. అంతేకాకుండా కారంగా ఉన్న ఆహారం అయితే చాలా తక్కువ మోతాదులో తింటారు కాబట్టి అలా కూడా బరువు తగ్గడానికి అవకాశం ఉంటుంది. కారంలో ఉండే అనేక ఔషధ గుణాలు రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు కూడా తొలగిపోతాయి.ల

## వంకాయతో బోలెడు ప్రయోజనాలు...!



కర్రీ, ఫ్రై, పులుసు, బజ్జీ..ఇలా అనేక రకాలుగా వండుకుని తింటారు. వంకాయను అనేక రకాలుగా వండుకోవచ్చు. వంకాయలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుఉన్నాయి. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వంకాయలో జీర్ణక్రియను మెరుగు పరిచే గుణం ఉంది. కెలరీలను కరిగించే శక్తి కూడా వంకాయకు ఉంది. అంతేకాదు, వంకాయతో మధుమేహాన్ని తగ్గించుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది రక్త ప్రవాహాన్ని మెరుగు పరుస్తుంది. ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బీ3, బీ6 మాత్రమే కాదూ వంకాయలో బీటా కేరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గుండె పోటు రాకుండా నియంత్రించగలదు. శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తుంది. వంకాయలో కెరోటినాయిడ్స్ అనే పోషకాలు ఉన్నాయి. ఈ కెటినాయిడ్స్ విటమిన్ ఏ లోపాన్ని కంట్రోల్ చేస్తుంది. వంకాయ తినడం వల్ల విటమిన్ ఏ మనకు సరిపడా లభిస్తుంది. విటమిన్ ఏ తో కంటి చూపు మెరుగుపడుతుంది. బాడీలో ఉన్న కొవ్వును తగ్గించడం లో కూడా వంకాయలు చాల కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఇక్కడే ఒక జాగ్రత్త తీసుకోవాలి. వంకాయ కూర వండేప్పుడు నూనె తక్కువ ఉపయోగించాలి అనేది వైద్యుల సూచన. వంకాయ వండేటప్పుడు ఎక్కువ ఆయిల్ వాడితే ఇందులో ఉండే పోషక విలువలు తగ్గిపోతాయి. . వీటితో పాటు వంకాయలను రెగ్యులర్ గా తినడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం చాల వరకు ఉండదు అని వైద్య నిపుణుల మాట. వంకాయలు శరీరంలో ఉన్న విషపు వ్యర్థాలను బయటకు పంపి ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

## నేరేడు పండ్లు తింటున్నారా...?



తియ్యగా ఉండే నేరేడు పండ్లను ఇష్టపడనివారు ఉంటారా? ఇందులో కొన్ని పుల్లగా ఉంటాయి. ఈ పండ్లు పోషకాలతో నిండి ఉంటాయి. ముఖ్యంగా మధుమేహం, హృద్రోగులకు నేరేడు పండ్లు చాలా మంచివి.ప్రస్తుతం మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం దేశంలో షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య 10 కోట్లుగా పైగా ఉందని చెబుతున్నాయి అధ్యయనాలు. మరి ఈ వ్యాధితో బాధ పడే వారు నేరేడు పండ్లు తినవచ్చా అంటే బ్రహ్మాండంగా తినవచ్చు అంటున్నారు నిపుణులు. షుగర్ వ్యాధిగ్రస్తుల పాలిట నేరేడు పండ్లు దివ్యౌషధం అంటున్నారు. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఫలితంగా ఇవి జీర్ణక్రియను మెరుగుపరిచి.. మలబద్ధకం నుంచి ఉపశమనం పొందేలా చేస్తాయి. నేరేడులో విటమిన్-సి అధికంగా ఉంటుంది. అందుకే నేరేడు పండ్లను క్రమం తప్పకుండా తింటే రోగనిరోధక శక్తి మెరుగు పడుతుంది. అలాగే జలుబు, ఫ్లూ వంటి ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి కూడా రక్షిస్తుంది. ఇదే కాదు మరిన్ని చర్మ సమస్యలలో కూడా నేరేడు చాలా సహాయం చేస్తుందట. దంతాలు, చిగుళ్ళ సమస్యలను కూడా నివారిస్తుంది నేరేడు. చిగుళ్ళను బలోపేతం చేసి.. నోటి దుర్వాసనను తొలగిస్తాయి. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. ఈ నేరేడు గుండె జబ్బులను కూడా తగ్గిస్తుంది. శరీరంలో హానికరమైన కార్బన్-డయాక్సైడ్ స్థాయిని తగ్గిస్తాయి. ప్రతి భాగానికి ఆక్సిజన్ చేరుకోవడానికి నేరేడులోని పోషకాలు సహాయపడతాయి. ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది కూడా. అందుకే సీజన్ లో దొరికే నేరేడును తినండి. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

## టమాటాలు తింటే భయంకర జబ్బులకి చెక్

ప్రతి వంటింట్లో కూడా టమాట అనేది అతి ముఖ్యమైన కూరగాయ.అసలు టమోటాలు లేకుండా ఏ కూర కూడా పూర్తి కాదు. టొమాటో మన ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా అందాన్ని కూడా బాగా మెరుగుపరుస్తుంది.అయితే చాలా మంది కూడా ఎర్రటి టమాటాను వాడతారు. సాంబారు, పులుసు, చట్నీలకు ఉపయోగిస్తారు. అయితే పచ్చి టొమాటోలో కూడా చాలా రకాల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇవి మన శరీరానికి చాలా మేలు చేస్తాయి. పచ్చి టొమాటోల్లో క్యాల్షియం ఇంకా పొటాషియం ఎక్కువగా ఉంటాయి.ఇందులో విటమిన్లు A, C, ఫైటోకెమికల్స్ కూడా పుష్కలంగా ఉంటాయి.గ్రీన్ టొమాటోలో విటమిన్ కె, కాల్షియం ఇంకా లైకోపీన్ మెండుగా ఉంటాయి. వీటిని తినడం వల్ల ఎముకలు చాలా దృఢంగా తయారవుతాయి. ఈ పచ్చి టొమాటోలను చిన్న పిల్లలకు తినిపిస్తే వారు చాలా బలంగా ఎదుగుతారు.పచ్చి టమోటోలో బీటా కెరోటిన్ అనేది పుష్కలంగా ఉంటుంది. ఇది మీ కళ్లను ఎంతో ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా అలాగే ఐ ఫోకస్ మెరుగుపడుతుంది. ఇంకా అలాగే, వీటిలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి మంచి పోషణనిస్తుంది. జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.పచ్చి టొమాటోల్లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉండటం వల్ల క్యాన్సర్ జబ్బు రాకుండా నిరోధిస్తుంది. అలాగే అధిక రక్తపోటుతో బాధపడేవారు పచ్చి టమోటాలు తింటే మెరుగైన రిలీఫ్ ఉంటుంది. ఇంకా అలాగే వీటిని తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.పైగా ఇది సీజనల్ వ్యాధులను నివారిస్తుంది.ఇంకా పచ్చి టమాటలు తినడం వల్ల టైప్ -2 డయాబెటిస్ బాధితులు మంచి ఫలితాలని పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వీటిలో ఉండే లైకోపిన్, ఫైబర్.. వంటి పోషకాలు ఆక్సీకరణ ఒత్తిడిని ఈజీగా తగ్గించడంలో, కణజాల నష్టాన్ని నివారించడంలో, మంటను తగ్గించడంలో బాగా



సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.వీటిని చిన్న పీసులుగా కట్ చేసుకుని సలాడ్ వంటి వాటిల్లో మిక్స్ చేసి తినవచ్చు. కూరల్లో, స్మూతీస్, సూప్స్, వంటి వాటిల్లో యాడ్ చేసుకొని తింటే బాగుంటాయి.

## మొలకెత్తిన గోధుమల ప్రయోజనాలు!




మొలకెత్తిన గోధుమలను తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు సంబంధించిన సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు A, B, C, E మొలకెత్తిన గోధుమలలో లభిస్తాయి. ఇవి జీర్ణక్రియను మెరుగ్గా ఉంచడంలో సహాయపడతాయి.అధిక బరువును నియంత్రిస్తుంది: మొలకెత్తిన గోధుమలు మీ రోజు ఆహారంలో భాగంగా తీసుకుంటే.. ఎక్కువ సమయంపాటు మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఎందుకంటే మొలకెత్తిన గోధుమలను తినడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. దీంతో అతిగా తినకుండా ఉంటారు. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పోషకాలు పుష్కలం: మొలకెత్తిన గోధమలలో పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. దీంతో మన శరీర పనితీరు మెరుగ్గా ఉంటుంది. ముఖ్యంగా ఇందులో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. అందుకే మన డైట్లో మొలకెత్తిన గోధుమలను ఏదోవిధంగా చేర్చుకునేలా చూడండి. మధుమేహం బాధితులకు మంచిది: డయాబెటిక్ రోగులకు, మొలకెత్తిన గోధుమలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది డయాబెటిక్ రోగులకు సూపర్ ఫుడ్ అని చెబుతారు. అలాగే, మొలకెత్తిన గోధుమలు తీసుకోవడం వల్ల మన శరీరానికి కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, ఐరన్ జింక్ లభిస్తాయి. పోషకాలు అందుతాయి. జీర్ణక్రియ సైతం మెరుగుపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఏ, బీ, ఇ కూడా పుష్కలం. ఎముకలకు బలం: మొలకెత్తిన గోధుమలు తీసుకోవడం వల్ల ఎముకలు కూడా బలంగా మారతాయి. ఎందుకంటే ఇందులో ఎక్కువ శాతం కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. మొలకెత్తిన గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకలు ఆరోగ్యంగా బలంగా దృఢంగా మారతాయి. మొలకెత్తిన గోధుమలు ఎలా తయారు చేస్తారంటే.. ఇందుకోసం ముందుగా గోధుమలను శుభ్రంగా కడిగి రాత్రి సమయంలో నానబెట్టుకోవాలి. ఉదయం ఆ నీటిని మార్చి బాగా కడిగి ఓ గుడ్డ లేదా మొలకెత్తే డబ్బాల్లో గాలి చొరబడేలా చూసుకుని సుమారు 12 గంటలపాటు అలాగే పక్కన బెట్టేయాలి. ఆ మార్నాటికి మొలకలు వస్తాయి.

అధిక బరువును నియంత్రిస్తుంది: మొలకెత్తిన గోధుమలు మీ రోజు ఆహారంలో భాగంగా తీసుకుంటే.. ఎక్కువ సమయంపాటు మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది.

## ఈ ఒక్క టీని తాగడం అలవాటు చేసుకోండి....

### ఇక ఎప్పటికీ గుండెపోటు రాదు!



ప్రస్తుత కాలంలో ఏజ్‌తో సంబంధం లేకుండా చాలా మంది హార్ట్ ఎటాక్ వంటి సమస్యల బారిన పడుతున్నారు. ఆరోగ్య నిపుణుల ప్రకారం 20-60 ఏళ్లు ఉన్నవారిలో ఈ సమస్య అధికంగా ఉంటుందని చెబుతున్నారు. కాబట్టి గుండె సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ఇంపార్టెంట్. గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉండాలి అంటే ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు వ్యాయామం వంటివి చేస్తూ ఉండాలి. అయితే చాలామంది మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ తర్వాత టీ, కాఫీ తీసుకునే అలవాటు ఉంటుంది. సాధారణ టీ కంటే కొన్ని ఆరోగ్యకరమైన టీ హెల్త్‌కి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ ఈ లెమన్ గ్రాస్ టీ ని ప్రతి రోజు తీసుకోవడం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుందని.. దీని వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని వైద్యులు చెబుతున్నారు. లెమన్ గ్రాస్ టీ ఒక రుచికరమైన, ఆరోగ్యకరమైన పానీయం. ఇది శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ఉపయోగించబడుతోంది. ఇందులో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. లెమన్ గ్రాస్ టీలో ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఫ్రీ రాడికల్స్ కణాలను దెబ్బతీస్తాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. కానీ ఈ యాంటీ ఆక్సిడెంట్లు ఈ నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. అలాగే జీర్ణ సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

## మద్యం తాగిన తర్వాత వాంతి ఎందుకు...?



ఓటు హక్కు ఉన్నట్లు మద్యం సేవించేందుకు కూడా ఓ నిర్ణీత వయసు ఉంటుందట. మద్యపానం సేవించేందుకు 18 ఏళు నిండిన వారు మాత్రమే అర్హులు. కాదూ కూడదని 18 ఏళ్లలోపు మద్యం సేవిస్తే తగిన మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుంది.అందుకే ప్రపంచంలో కొన్ని దేశాల్లో మద్యం సేవించేందుకు నిర్ణీత వయసును అక్కడి ప్రభుత్వాలు నిర్ణయించాయి. కొన్ని చోట్ల 18 నిండని వారు పబ్‌లకు వెళ్లడంపై కూడా నిషేధం ఉంది. అయితే, చాలామంది యుక్తవయస్సు రాకముందే రహస్యంగా మద్యం సేవిస్తుంటారు. దీంతో తాగిన తర్వాత వాంతులు చేసుకుని, అనారోగ్యానికి గురవుతుంటారు. ఇలా ఎందుకు జరుగుతుందో మీరెప్పుడైనా ఆలోచించారా?ప్రతి ఒక్కరి శరీరం ఆల్కహాల్ సేవించిన తర్వాత భిన్నంగా స్పందిస్తుంది. నిర్ణీత పరిమితి తర్వాత మద్యం సేవించడం వల్ల వాంతులు అవుతాయి. సాధారణంగా తాగిన తర్వాత మైకం వస్తుంది.




# అశ్విని దత్ కాళ్ళు మొక్క బోయిన అమితాబ్



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కల్కి 2898 AD సినిమా మరి కొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ రోజు ముంబైలో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ ఈవెంట్ కి ప్రభాస్ తో పాటు అమితాబచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, సినిమా నిర్మాత అశ్వినీదత్ హాజరయ్యారు. ఇక ఈ ఈవెంట్ కి రానా హోస్ట్ గా వ్యవహరించగా.. ఈ ఈవెంట్లో ఒక ఆసక్తికర ఘట్టం చోటు చేసుకుంది. తెలుగు సినిమాలకు సంబంధించి బిగ్ టిక్కెట్ లాంచ్ అనేది ఆనవాయితీగా వస్తుంది. అలాగే బిగ్ టిక్కెట్ లాంచ్ చేసిన తర్వాత దాన్ని స్వయంగా డబ్బులు ఇచ్చి అమితాబచ్చన్ కొనుగోలు చేశారు.

ఆ తర్వాత దాన్ని కమల్ హాసన్ కి గిఫ్ట్ గా ఇచ్చారు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అమితాబచ్చన్ అశ్వినీ దత్ గురించి కొన్ని గొప్ప విషయాలు చెప్పి ఆయన కాళ్లు మొక్కబోయారు. వెంటనే అశ్వినీ దత్ కూడా రియాక్ట్ అయ్యి ఆయన కూడా అమితాబచ్చన్ కాళ్లు మొక్కేందుకు ప్రయత్నించారు. అశ్వినీ దత్ చాలా గొప్ప మనిషి అని ఇంత సింపుల్ గా ఉండే నిర్మాతను తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. సెట్లో ముందుండే ఆయన హీరో ఎలాంటి రిస్క్ లేకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటారని అమితాబ్ చెప్పుకొచ్చారు.


# కల్కి ప్రీ రిలీజ్ ఈవెంట్ లో దీపికా ఇంట్రెస్టింగ్ కామెంట్స్..

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ మైథాలజీ మూవీ కల్కి 2898AD. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే, దిశా పటానిలు ఫీమేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. కాగా, ఈ మూవీకి సంబందించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ ను నేడు ముంబైలో నిర్వహించారు. ఈ వేడుకలో హీరోయిన్ దీపికా పదుకొనె పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ సినిమాలో నటించడం పట్ల పలు వ్యాఖ్యలు చేశారు. అద్భుతమైన ఎక్స్ పీరియన్స్ అని, ఎంతో నేర్చుకున్నా అని అన్నారు. పర్సనల్ గా, ప్రొఫెషనల్ గా ఈ మూవీ ఎంతో ఉపయోగపడింది అని అన్నారు. అమితాబ్ బచ్చన్ చెప్పినట్లు గా మొత్తం డిఫరెంట్ వరల్డ్ లో ఉన్నట్లు అనిపిస్తుంది అని అన్నారు. అంతేకాక డైరెక్టర్ నాగ్ అశ్విన్ తో వర్క్ చేయడం అద్భుతమైన అనుభవం అని పేర్కొన్నారు. ఈ సినిమాలో దీపికా పదుకునే తల్లి పాత్రలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో నవీన్ చంద్ర లెవన్ టీజర్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని నటుడు నవీన్‌చంద్ర. ఈ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం లెవన్. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని లోకేశ్ అజిల్స్ డైరెక్ట్ చేస్తున్నాడు. తాజాగా మేకర్స్ లెవన్ టీజర్‌ను లాంఛ్ చేశారు. వరుస హత్యలు చేస్తున్న హంతకుడిని పట్టుకునే పోలీసాఫీసర్ పాత్రలో నవీన్ చంద్ర కనిపించబోతున్నట్టు టీజర్ ద్వారా క్లారిటీ ఇచ్చాడు డైరెక్టర్. వరుస హత్యల వెనక ఎవరున్నారనేది సస్పెన్స్‌లో పెడుతూ.. హత్యలను చేధించే క్రమంలో ఇంట్రెస్టింగ్‌గా మూవీ సాగనున్నట్టు హింట్ ఇస్తూ కట్ చేసిన టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో రెయా హరి, శశాంక్, అభిరామి, దిలీపన్, రిత్విక, రవి వర్మ, కిరీటి దామరాజు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





### రైటర్‌తో రిలేషన్‌షిప్‌లో శ్రద్ధాకపూర్..

# క్లారిటీ ఇచ్చేసినట్టేనా..?

తెలుగులో కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న బాలీవుడ్ భామల్లో ఒకరు శ్రద్ధాకపూర్. సాహో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పిన ఈ భామ నెట్టింట ఏదో ఒక అప్‌డేట్‌తో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజాగా శ్రద్ధాకపూర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. శ్రద్ధాకపూర్ రైటర్ రాహుల్ మోడీ తో రిలేషన్‌షిప్‌లో ఉందా..? అంటే తాజా పోస్ట్ ఒకటి అవుననే అంటోంది. ఈ ఇద్దరు పలు పార్టీల్లో కలిసి కనిపించడం, శ్రద్ధాకపూర్ %=% అక్షరంతో ఉన్న లాకెట్‌ను ధరించడంతో ఇప్పటికే రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా రాహుల్ మోడీతో క్లోజప్ యాంగిల్‌లో దిగిన సెల్ఫీని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసిన శ్రద్ధాకపూర్.. నా మనస్సును హత్తుకో.. కానీ నన్ను నిద్రపోనివ్వు.. అంటూ క్యాప్షన్ ఇచ్చింది. శ్రద్ధాకపూర్ తాను రాహుల్ మోడీతో రిలేషన్‌షిప్‌లో ఉన్నానని దాదాపు క్లారిటీ ఇచ్చేసిందంటూ తెగ చర్చించుకుంటున్నారు నెటిజన్లు. శ్రద్ధాకపూర్ నటించిన Tu Jhoothi Main Makkaarకు రైటర్‌గా పనిచేశాడు రాహుల్ మోడీ. ఈ మూవీ టైంలోనే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించిందని బీటౌన్ సర్కిల్ టాక్. రాహుల్ మోడీ మరో రెండు సినిమాలకు కూడా రైటర్‌గా పనిచేశాడు. శ్రద్ధాకపూర్ నటించిన స్త్రీ 2 ఇండిపెండెన్స్ డే కానుకగా విడుదల కానుంది.



# కేంద్ర బడ్జెట్ 2024.. పన్ను మినహాయింపు పరిమితుల్లో సవరణ?



ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర బడ్జెట్ (2024)ను మొదటిసారి జూలై 24న ప్రవేశపెట్టనున్నారు. 60 ఏళ్ల కిందట మొరార్జి దేశాయ్ ఆరు సార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. కానీ నిర్మలా సీతారామన్ 7వ సారి బడ్జెట్ ప్రవేశపెడుతూ ప్రత్యేకంగి నిలుస్తున్నారు. బీజేపీతో పాటు ఆ కూటమి పార్టీల నుంచి 72 నుంది సభ్యులు క్యాబినెట్, సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 2024 లోక్ సభ ఎన్నికలకు ముందు ఆమె ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్ ను సమర్పిం చారు. కాగా పూర్తి స్థాయి బడ్జెట్ లో నిర్మలా సీతారామన్ కొన్ని పన్ను విధానాలకు మినహాయింపులు ఇవ్వనున్నారు. కొత్త బడ్జెట్ సామాన్యులకు గుడ్ న్యూస్ చెప్పే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ బడ్జెట్లో పన్ను మినిహాయింపులు ఎక్కువగా ఉంటుందని చెల్లింపుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సెక్షన్ 80 సీ, 80డీ కింద మినహాయింపు పరిమితుల్లో సీతారామన్ సవరణ చేస్తారని నిపుణులు కూడా అభిప్రాయడుతున్నారు . ప్రభుత్వం చివరిసారిగా 2014-15 కేంద్ర బడ్జెట్లో సెక్షన్ 80సీ కింద మినహాయింపు పరిమితిని సవరించింది. లక్షల నుంచి రూ. లక్షకు పెంచింది. మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు మినహాయింపు ప్రయోజనాల పరంగా అత్యంత కీలకమైన విభాగం. సెక్షన్ 80సీ కింద పన్ను చెల్లింపుదారులు సీపీఎఫ్. ఎన్సీఎస్ చిన్ని పొదువులు, జీవిత బీమా, ఈఎల్ఎస్ఎస్, యూలీప్ లు, హెరీమ్ లోన్ ప్రిన్సిపల్ రీపేమెంటీత వాటిపై ప్రయోజనాలు పొందవచ్చు. కొత్త ప్రభుత్వంలో వెన్ను చెల్లింపుదారులు స్పష్టమైన, మరింత సమర్థవంతమైన పన్ను వ్యవస్థ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వెస్ను స్లాబ్ లను తగ్గించడంతో పాటు మినహాయింపులను క్రమబద్ధీక రించడం వంటివి సాధారణ ప్రజలకు సమ్మతిని సులభతరం చేసే అవకాశం ఉందని నీవుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆదాయంపు పన్నుప్రాసెసింగ్ సమయాన్ని తగ్గించడంతో పాటు పారదర్శకత మెరుగుపరచడానికి పన్ను విధానంలో డిజిటల్ సిస్టము పెంచేలా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్కూల్ ఫీజులపై మినహాయింపు సిక్షన్ 80సి నుంచి మినహాయింపులు ఇస్తారని అంటున్నారు. కానీ నిర్మలా సీతారామన్ 7వ సారి బడ్జెట్ ప్రవేశపెడుతూ ప్రత్యేకంగి నిలుస్తున్నారు. బీజేపీతో పాటు ఆ కూటమి పార్టీల నుంచి 72 నుంది సభ్యులు క్యాబినెట్, సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

# ఈ బ్యాంకు లైసెన్స్‌ను రద్దు చేసిన ఆర్బీఐ..





భారతీయ రిజర్వ్ బ్యాంక్ బ్యాంకులపై కీలక నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది. కస్టమర్లకు ఎలాంటి సమస్యలు రాకుండా బ్యాంకింగ్ వ్యవస్థను మరింతగా మెరుగు పర్చేందుకు కీలక అడుగులు వస్తుంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. సహకార బ్యాంకు లైసెన్స్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సెంట్రల్ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసిన బ్యాంక్ పేరు పూర్వాంచల్ కో-ఆపరేటివ్ బ్యాంక్. ఇది ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో ఉంది. పూర్వాంచల్ కోఆపరేటివ్ బ్యాంక్‌కు తగినంత మూలధనం, సంపాదన సామర్థ్యం లేదని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. బ్యాంక్‌ను మూసివేసి లిక్విడేటర్‌ను నియమించాలని ఉత్తర్‌ప్రదేశ్‌లోని కోఆపరేటివ్ కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్‌ను ఆదేశించినట్లు ఆర్‌బిఐ ఆ ప్రకటనలో తెలిపింది. లిక్విడేషన్ కింద, ప్రతి డిపాజిటర్ తన డిపాజిట్ మొత్తాన్ని డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ లోన్ గ్యారెంటీ కార్పొరేషన్ నుండి రూ. 5 లక్షల వరకు మాత్రమే స్వీకరించడానికి అర్హులు. పూర్వాంచల్ కోఆపరేటివ్ బ్యాంక్ డేటా ప్రకారం, డిపాజిటర్లలో 99.51 శాతం మంది డిఐసిజిసి నుండి తమ మొత్తం డిపాజిట్లను పొందడానికి అర్హులు అని ఆర్‌బిఐ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక స్థితితో సహకార బ్యాంకు తన ప్రస్తుత డిపాజిటర్లకు పూర్తి చెల్లింపులు చేయలేకపోయిందని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. బ్యాంకుకు తగినంత మూలధనం, ఆదాయ సామర్థ్యం లేదని ఆర్‌బిఐ తెలిపింది. బ్యాంకింగ్ వ్యాపారాన్ని మరింత కొనసాగించడానికి బ్యాంకును అనుమతించినట్లయితే, అది ప్రజా ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. రెండు పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లపై చర్యలు తీసుకుంటుండగా, ఆర్బీఐ కోట్ల జరిమానా విధించింది. యెస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ సెంట్రల్ బ్యాంక్ అనేక నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని బ్యాంకింగ్ రెగ్యులేటర్ చెప్పారు. దీని కారణంగా యెస్ బ్యాంక్‌పై రూ.91 లక్షలు, ఐసీఐసీఐ బ్యాంక్‌పై కోటి రూపాయల జరిమానా విధించారు.

# లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు....




**ముంబయి :** అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల మధ్య దేశీయ సూచీలు మంగళవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:22 గంటల సమయంలో సెన్సెక్స్ 192 పాయింట్లు పెరిగి 77,185 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 57 పాయింట్లు పుంజుకొని 23,522 దగ్గర కొనసాగుతోంది. నిఫ్టీ తొలిసారి 23,500 మైలురాయిని దాటడం విశేషం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 83.52 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30సూచీలో విప్రో, ఎం అండ్ ఎం, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టైటన్, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. మారుతీ, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. మే నెలకు సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న తరుణంలో అమెరికా మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా-పసిఫిక్ సూచీలు సానుకూలంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 84.10 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు శుక్రవారం నికరంగా రూ. 2,176 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ. 655 కోట్ల వాటాలను కొన్నారు.

# మహేంద్ర నుంచి కొత్త ఎస్‌యువి ఎలక్ట్రిక్ వెహికల్స్..!



ఇప్పుడు అంతా ఎలక్ట్రిక్ కార్ల యుగంగా మారిపోయింది. చాలామంది తమ వద్ద ఉన్న పెట్రోల్ డీజిల్ కార్ల స్థానంలో ఎలక్ట్రిక్ కార్లను తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తిని ప్రోత్సహించడంతో వీటిని ఉత్పత్తి చేయడానికి కంపెనీలు ఉత్సాహంగా ఉన్నాయి. అయితే ఎస్ యు వీ వేరియంట్ లో ఎలక్ట్రికల్ కార్లను ఉత్పత్తి చేయడంలో మహేంద్ర అండ్ మహీంద్రా కంపెనీ సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా కొత్త ఎలక్ట్రికల్ ఎస్‌ఈఓ లను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. అయితే మహేంద్ర నుంచి రాబోయే ఎలక్ట్రిక్ ఈ వీల గురించి తెలుసుకోవాలని ఉందా? అయితే కిందికి వెళ్ళండి.. మహేంద్ర స్కార్పియో కారు గురించి అందరికీ తెలిసిందే. అయితే దీనిని అప్డేట్ చేస్తూ ఎలక్ట్రిక్ వెర్షన్ ను తీసుకొస్తున్నారు. దీనికి స్కార్పియో. ఈ.. అని నామకరణ చేసినట్లు సమాచారం. ఈ మోడల్ 2,775 ఎంఎం నుంచి 2975 ఎంఎం వీల్ బేస్ ను కలిగే ఉండే అవకాశం ఉంది. మహేంద్ర స్కార్పియోకు ఇప్పటికే మంచి డిమాండ్ ఉంది. ఇదే పేరుతో ఈవీని తీసుకురావడం వల్ల ఆదరణ ఉంటుందని కంపెనీ భావిస్తుంది. మహీంద్రా నుంచి మరో ఈవీ రాబోతుంది. దీనికి స్కార్పియో. ఈ పవర్ ట్రైయిన్ అని నామకరణం చేశారు. ఈ వెర్షన్లో వస్తున్న ఇందులో బ్యాటరీ, ఎలక్ట్రిక్ మోటార్లు ఉండనున్నాయి. ఈ మోడల్ 109 బీహెచ్ పీ పవర్, 135 ఎంఎం టార్క్ ను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఇది 325 కిలోమీటర్ల నుంచి 450 కిలోమీటర్ల మైలేజ్ ఇచ్చే అవకాశం ఉంది. మహేంద్ర బొలెరో ను చాలామంది సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఈ మోడల్ కూడా ఎలక్ట్రికల్ వెర్షన్లో రాబోతుంది. స్కార్పియో మాదిరిగానే ఇది కూడా inglo ప్లాట్ ఫామ్ ను ఉపయోగించుకోనుంది. ప్రస్తుతం బొలేరో 2,680ఎన్ఎం టార్క్ కలిగి ఉన్నట్లు సమాచారం. అయితే మహేంద్ర నుంచి రాబోయే ఎలక్ట్రిక్ ఈ వీల గురించి తెలుసుకోవాలని ఉందా? అయితే కిందికి వెళ్ళండి.. మహేంద్ర స్కార్పియో కారు గురించి అందరికీ తెలిసిందే. అయితే దీనిని అప్డేట్ చేస్తూ ఎలక్ట్రిక్ వెర్షన్ ను తీసుకొస్తున్నారు. దీనికి స్కార్పియో. అయితే బొలెరో ఈ 325 కిలోమీటర్ల నుంచి 450 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇచ్చే అవకాశం మహేంద్ర ఎక్స్ యు యూ వి అనే ఎలక్ట్రిక్ వెర్షన్ కూడా రాబోతుంది. దీనిని ఇప్పటికే పరీక్షించారు. ఇది 450 నుంచి 500 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇవ్వమంది.

# టీసీఎస్‌కు కోర్టు రూ.1620 కోట్ల జరిమానా





దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీకి కోట్ల రూపాయల దెబ్బ తగిలింది. టాటా గ్రూపునకు చెందిన ఐటీ కంపెనీకి అమెరికా కోర్టు కోట్ల రూపాయల మేర భారీ జరిమానా విధించింది. ఈ సమాచారాన్ని కంపెనీ స్వయంగా కలిగి ఉంది. వాస్తవానికి, అమెరికన్ ఐటి సేవల సంస్థ డిఎక్స్‌సి (గతంలో సిఎస్‌సి అని పిలిచేవారు) వాణిజ్య రహస్యాన్ని దుర్వినియోగం చేసినందుకు టిసిఎస్‌పై అమెరికన్ కోర్టు 194 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ. 1620 కోట్ల జరిమానా విధించింది. సీఎస్‌ఈకి 56 మిలియన్ డాలర్ల నష్టపరిహారం, 112 మిలియన్ డాలర్ల ఆదర్శప్రాయమైన నష్టపరిహారం చెల్లించాలని టీసీఎస్ ని కోర్టు కోరింది. స్టాక్ మార్కెట్లకు టీసీఎస్ అందించిన సమాచారం ప్రకారం.. దానిపై విధించిన జరిమానా 194.2 మిలియన్ డాలర్లు. ఇందులో 561.5 మిలియన్ డాలర్ల పరిహార నష్టాలు, 112.3 మిలియన్ డాలర్ల నష్టాలు, 25.8 మిలియన్ డాలర్ల ముందస్తు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. భారతీయ కరెన్సీలో జరిమానా మొత్తం సుమారు రూ. 1,622 కోట్లు. 2018లో అమెరికా బీమా కంపెనీ ట్రాన్సామెరికా నుండి టీసీఎస్ 2.5 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాన్ని పొందింది. ఈ ఒప్పందం ప్రకారం.. ట్రాన్స్‌అమెరికాకు చెందిన 10 మిలియన్ల మంది వినియోగదారులకు ఒకే ప్లాట్‌ఫారమ్‌లో అన్ని సౌకర్యాలు అందించాలి. గతేడాది జూన్‌లో ఈ డీల్ రద్దయింది. ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడం వల్ల ఈ డీల్ రద్దయింది. అయితే కోర్టు నిర్ణయాన్ని సవాలు చేసేందుకు తమకు బలమైన ఆధారాలు ఉన్నాయని భారతీయ ఐటీ కంపెనీ టీసీఎస్ చెబుతోంది. జిల్లా కోర్టు నిర్ణయాన్ని సముచిత న్యాయస్థానంలో సవాలు చేసి రివ్యూ పిటిషన్ వేయబోతున్నట్లు టీసీఎస్ తెలిపింది. జూన్ 14, 2024న కోర్టు సంబంధిత ఆర్డర్‌ను స్వీకరించినట్లు టీసీఎస్ చెబుతోంది. భారీ జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీసుకున్న నిర్ణయం తమ కంపెనీపై ఎలాంటి ఆర్థిక ప్రభావం చూపబోదని టీసీఎస్ భావిస్తోంది. తన ప్రయోజనాలను పరిరక్షించడానికి.. ఈ కోర్టు ఆర్డర్ నుండి తలెత్తే న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు కంపెనీ సిద్ధమవుతోంది. రివ్యూ పిటిషన్, ఛాలెంజ్ తర్వాత నిర్ణయం తమకు అనుకూలంగా వస్తుందని టీసీఎస్ భావిస్తోంది.

# జొమాటో చేతికి పేటీఎం టికెట్ బుకింగ్ వ్యాపారం...?




ముంబయి: ఆహారాన్ని డెలివరీ చేసే ఫుడ్‌టెక్ సంస్థ జొమాటో, పేటీఎంకు చెందిన సినిమాలు, ఈవెంట్ల టిక్కెట్ల బుకింగ్ విభాగాన్ని కొనుగోలు చేసే యత్నాలు చేస్తోంది. ఇందుకోసం ప్రాథమికస్థాయి చర్చలు జరిపినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు జొమాటో, పేటీఎం సమాచారం ఇచ్చాయి. పేటీఎం మూవీ టికెట్స్ విభాగాన్ని జొమాటో రూ. 1,600-1,750 కోట్లకు కొనుగోలు చేస్తోందంటూ వచ్చిన కథనాలపై ఇరు సంస్థలూ స్పందించాయి. ‘పేటీఎం మూవీ టిక్కెట్ విభాగాన్ని కొనుగోలు చేసేందుకు చర్చిస్తున్నాం. తుది నిర్ణయం తీసుకోలేదు. చట్ట పరిధిలో, బోర్డు అనుమతికి లోబడి తదుపరి చర్యలు ఉంటాయి’ అని జొమాటో బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. కంపెనీ వృద్ధి కోసం వ్యూహాత్మకంగా వ్యాపారాలను విస్తరించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇది కంపెనీ కీలక వ్యాపారాలకు అనుగుణంగానే ఉందని వివరించింది. మా దృష్టి డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవలపైనే ఉంటుందని పేటీఎం పేర్కొంది. ప్రస్తుతం జరిగిన చర్చలు పూర్తిగా ప్రాథమికమైనవేనని, ఎలాంటి ఒప్పందాలూ లేవని స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆంక్షల నేపథ్యంలో, పేటీఎం కు ఆదాయం తగ్గినందున ఉద్యోగులను తొలగిస్తోంది. ఈ తరుణంలో ఇప్పుడు టికెట్ విక్రయ విభాగాన్ని విక్రయించనుందనే వార్తలు ఆసక్తి రేపాయి. రెండు నెలలుగా వినియోగదారులు, వ్యాపార భాగస్వాములకు సంబంధించి స్థిరంగా వృద్ధి లభిస్తున్నందున, ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి పేటీఎం కోలుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. పేటీఎం నుంచి టికెట్ విభాగ కొనుగోలు సాకారమైతే, జొమాటో ఈ వ్యాపారంలో మరింత విస్తరించేందుకు వీలవుతుందని పేర్కొంటున్నారు.

# ఆదాయపు పన్ను రేట్లు తగ్గుతాయా...?




నిరుద్యోగం పెరుగుతుండగా.. ఆదాయాల్లో వృద్ధి అంతగా ఉండటం లేదు. పైగా అధిక ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయపు పన్ను శ్లాబులను సవరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వచ్చే నెలలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ వెల్లడించింది. నరేంద్రమోదీ ప్రధానిగా వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, భాజపా సొంతంగా సాధారణ మెజార్టీ సాధించడంలో విఫలమైంది. ఈ క్రమంలోనే ప్రజలకు ఆర్థికంగా సాంత్వన చేకూరేలా తొలి బడ్జెట్‌లో కొన్ని ప్రణాళికలను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. 2023-24లో దేశ ఆర్థిక వ్యవస్థ 8.2% వృద్ధి చెందినా.. వినియోగ రంగంలో సగమే వృద్ధి కనిపించింది. ఎన్నికల తర్వాత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నప్పుడు.. ‘మధ్యతరగతి పొదుపు మొత్తాలు పెరిగేలా, వారి జీవిత నాణ్యత మెరుగుపడేలా’ చూస్తామని నేతలు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పన్ను రేట్లలో కోత విధిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. కానీ, రూ. 15 లక్షలకు మించితే 30% పన్ను చెల్లించాలి. రూ. 10 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారికి పన్ను రేట్లు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి, కొత్త ఆదాయ పరిమితిని ప్రకటించే వీలూ కనిపిస్తోంది. రూ. 5 లక్షల వార్షికాదాయానికి ఎలాంటి పన్నూ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతూనే ఉన్నారు. వార్షికాదాయం రూ. 20 లక్షలు మించితేనే 30% పన్ను శ్లాబు ఉండాలనే సూచనలూ ప్రభుత్వానికి అందాయి. రూ. 5-10 లక్షల లోపు ఆదాయానికి 5%, రూ. 10-20 లక్షల లోపు వారికి 20% పన్ను శ్లాబు వర్తింపచేయాలని కోరుతున్నారు. పన్ను తగ్గింపు వల్ల ప్రభుత్వానికి ఆదాయం కొంత తగ్గినా, వినియోగం పెరగడంతో పరోక్ష పన్నులు, జీఎస్‌టీ వసూళ్ల రూపేణ భర్తీ అవుతుందనే సూచనలూ ఉన్నాయి. ఇవి ఎంత మేరకు సాధ్యం అన్న విషయాన్నీ ప్రభుత్వం అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రి ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి బడ్జెట్ చర్చలు ప్రారంభం కానున్నాయి. నరేంద్రమోదీ ప్రధానిగా వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, భాజపా సొంతంగా సాధారణ మెజార్టీ సాధించడంలో విఫలమైంది.

గరుడ వార్త

గురువారం, జూన్ 20, 2024

# రూ. 100 కోట్ల ముడుపులు డిమాండ్ చేసిన కేజ్రీవాల్

**- మా వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయి**

**- రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపిన ఇడి**



న్యూఢిల్లీ: లిక్కర్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రూ. 100 కోట్ల ముడుపులను డిమాండ్ చేసినట్లుగా తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) బుధవారం రౌస్ అవెన్యూ కోర్టుకు తెలియచేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇడి తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపిస్తూ ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై ఇడి దాఖలు చేసిన చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఇదే కేసులో సహ నిందితుడైన ఢిలీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడం మనీ లాండరింగ్ ఆరోపణలను ఆమోదించినట్లేనని ఆయన తెలిపారు. ఈ కేసులో మనీ లాంరింగ్ జరిగినట్లు ఇడి దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నాయని సంతృప్తి చెందినట్లేనని ఆయన చెప్పారు. రూ. 100 కోట్ల ముడుపులను కేజ్రీవాల్ డిమాండ్ చేసినట్లు సిబిఐ దర్యాప్తులో వెల్లడైందని ఇడి తెలిపింది. కేజ్రీవాల్ అరెస్టుకు ముందే సాక్ష్యాలను తాము సేకరించామని ఎఎస్‌జి రాజు కోర్టుకు తెలిపారు. కాగా..కేజ్రీవాల్ తరఫున న్యాయవాది విక్రమ్ చౌదరి తన వాదనలు వినిపిస్తూ ఏ చార్జిషీట్‌లోను కేజ్రీవాల్ పేరును ప్రస్తావించలేదని తెలిపారు. సిబిఐ నమోదుచేసిన ఎఫ్‌ఐఆర్‌లో కూడా కేజ్రీవాల్‌ను నిందితుడిగా పేర్కొనలేదని ఆయన తెలిపారు. ఇడి చేస్తున్న ఆరోపణలన్నీ పిఎంఎల్‌ఎ కింద కాకుండా సిబిఐ కేసులో వాదనలు వినిపిస్తున్నట్లు ఉందని ఆయన తెలిపారు. మే 10న సుప్రీంకోర్టు తన ఉత్తర్వులలో దిగువ కోర్టులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని పేర్కొందని న్యాయవాది తెలిపారు. బెయిల్ ఇప్పిస్తామన్న హామీతో ఇదివరకు అరెస్టు చేసిన సాక్షుల వాంగ్మూలాల ఆధారంగానే మొత్తం కేసు నడుస్తోందని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. క్షమాభిక్ష పెడతామని ప్రలోభ పెట్టి సాక్షం చెప్పించారని, సాక్షం ఇచ్చిన వారి విశ్వసనీయతను సవాలు చేస్తున్నామని న్యాయవాది చెప్పారు. 2022 ఆగస్టులో ఈ కేసు పురుడుపోసుకోగా 2024 మార్చిలో కేజ్రీవాల్ అరెస్టు జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌న అరెస్టు చేయడం దీని వెనుక గల దురుద్దేశాన్ని తెలియచేస్తోందని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా కేజ్రీవాల్ జుడిషియల్ కస్టడీని కోర్టు జులై 3వ తేదీ వరకు పొగించింది.

## ఆ స్థలాలు హైదరాబాద్ జర్నలిస్టులకు ఇస్తాం: పొంగులేటి




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర మరువలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో జర్నలిస్టులకు చేసిందేమీలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఖమ్మంలో టియుడబ్లుజె, ఐజెయు రాష్ట్ర తృతీయ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. నేతలు, జర్నలిస్టులు ఈనాడు అధినేత రామోజీరావుకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. అక్రిడేషన్ కార్డులు మరో మూడు నెలలు పొడిగిస్తున్నామని, హెల్త్‌కార్డుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అతి కొద్దిరోజుల్లోనే హైదరాబాద్ జర్నలిస్టులకు కేటాయించిన స్థలం ఇస్తామని, ఖమ్మం జిల్లా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు త్వరలోనే పరిష్కరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. వారం, పది రోజుల్లోనే హైదరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన జీవో విడుదల చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే హైదరాబాద్ లో మిగిలిపోయిన మిగతా జర్న లిస్టులకు, జిల్లాలు, మండలాల్లో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వర లోనే ఒక పాలసీని తీసుకవస్తామని పొంగులేటి చెప్పారు.

## ఐసియులో భార్య మృతదేహం వద్దనే ఐపిఎస్ బలవన్మరణం



గువహటి : అస్సాం హెూం శాఖ కార్యదర్శిగా పనిచేసే శిలాదిత్య చెతియా తన భార్య మరణాన్ని తట్టుకోలేక ఆమె మృతదేహం ఉన్న ఐసీయు లోనే తుపాకీతో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నారు. అస్సాం లోని గువహటికి చెందిన ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం ఈ విషాదకర సంఘటన జరిగింది. తీన్‌సుకియా, సోనిత్‌పుర్ జిల్లాల్లో ఎస్పీగా పనిచేసిన శిలాదిత్య, అస్సాం పోలీస్ విభాగానికి చెందిన ఫోర్త్ బెటాలియన్‌కు కమాండెంట్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తరువాత హెూం శాఖ కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 2009 బ్యాచ్‌కు చెందిన శిలాదిత్య భార్య కొద్ది కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గువాహటిలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను దగ్గరుండి చూసుకోడానికి నాలుగు నెలలుగా శిలాదిత్య సెలవు లోనే ఉన్నారు. మంగళవారం ఆమె ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోవడంతో తట్టుకోలేక ఐసీయు వద్దనే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనకు అస్సాం పోలీస్ కుటుంబం మొత్తం తీవ్ర విషాదంలో మునిగిందని డిజిపి జిపి సింగ్ ఎక్స్ పోస్ట్‌లో సంతాపం వెలిబుచ్చారు. చెతియాకు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఆయన తల్లి, అత్తగారు కొన్ని నెలల్లోనే చనిపోయారు. శిలాదిత్య తండ్రి కూడా పోలీస్ ఆఫీసరే. శిలాదిత్యకు సంతానం లేదు.

## పాకిస్థాన్‌లో భారీ భూకంపం..15 మంది మృతి



పాకిస్థాన్‌లో బుధవారం తెల్లవారు జామున సంభవించిన భూకంపంలో ఇప్పటివరకు 15 మంది ప్రాణాలు కోల్పోయినట్టు పాకిస్థాన్ విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు. రిక్టర్‌స్కేలుపై భూకంప తీవ్రత 5.7 గా నమోదైనట్టు పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్ ఆగ్నేయ ప్రాంతంలో 98 కిమీ లోతున భూకంపం కేంద్రీకృతమైందని, దాని ప్రకంపనలు ఇస్లామాబాద్, రావల్పిండి, పెషావర్, స్వాత్, మలకంద్, నార్త్ వజ్రిస్థాన్, పారాచినార్, లోయర్ దిర్, హంగు, చార్‌సద్దా, స్వాబి ప్రాంతాలకు విస్తరించాయని నేషనల్ సిస్మెక్ మోనిటరింగ్ సెంటర్ వెల్లడించింది. పలుచోట్ల భవనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

# అస్సాంలో వరదలు..30 మంది మృతి



అస్సాంలో తీవ్రమైన వరదల కారణంగా ఇప్పటివరకు 30 మందికి పైగా మరణించారు. 15 జిల్లాల్లో 1.61 లక్షల మంది బాధితులయ్యారు. కరీంగంజ్ జిల్లా లోని బదర్‌పూర్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడంతో ఒక మహిళ. ఆమె ముగ్గురు కుమార్తెలు, అలాగే మూడేళ్ల బాలుడు సహా ఐదుగురు వ్యక్తులు మరణించారు. గైనచోర గ్రామంలో మంగళవారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. గత మే నెలలో రెమాల్ తుపాను వల్ల కొండచరియలు విరిగిపడి పలువురు మరణించగా, ఇప్పటివరకు మొత్తం మరణాల సంఖ్య 30 కి చేరుకుంది. గైనచోర గ్రామ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడంతో శిధిలాల నుంచి ఐదు మృతదేహాలను వెలికి తీసినట్టు కరీంగంజ్ జిల్లా ఎస్‌పి తెలిపారు. కరీంగంజ్ లో వరద నీటిలో 152133 మంది కొట్టుమిట్టాడుతున్నారు.

# గిరిజనుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలి

**- రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**- ములుగు జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి**

**- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవు - త్వరలోనే ఐటిడిఏ పాలక మండలి సమావేశం**

**జయశంకర్ భూపాలపల్లి:** గిరిజనుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని, ములుగు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని, త్వరలోనే ఐటిడిఏ పాలక మండలి సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ఏటూరు నాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ కార్యాచరణ ప్రణాళిక సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా , అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ యాదవ్, ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ బి.గితే లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ఐటీడీఏ కార్యాలయాలను ఏర్పాటు చేసిందని త్వరలోనే ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పాలకమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆరు నెలలుగా పెండిగ్ లో ఉన్నా అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని పనులు అత్యంత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలు వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని , వసతి గృహాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని , కలుషిత ఆహారం తినడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కున్నారు అనే వార్తలు రాకూడదని ఐటీడీఏ పాఠశాలలో మెరుగైన మార్పులు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజనుల ఆరోగ్యం పట్ల వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలని గుత్తి కోయా ప్రాంతాలలో ప్రత్యేకంగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని వరదల సమయంలో గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆసుపత్రులకు తరలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆశ అంగన్వాడీల సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలలో వైద్య సదుపాయాలు కల్పించాలని గిరిజనులకు ఆరోగ్యం పై ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇప్పపువ్వు చెట్ల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తద్వారా గిరిజనులకు ఉపాధి లభించడంతోపాటు అడవి పచ్చదనంగా మారుతుందని ఇప్పపువ్వు , గింజల సేకరణ ద్వారా గిరిజనులకు ఉపాధి లభ్యం అవుతుంది కాబట్టి వాటి పెంపకంపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మాదక ద్రవ్యాలు డ్రగ్స్ మత్తు పదార్థాలు వంటి వాటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సరిహద్దు దగ్గరగా ఉన్న నేపథ్యంలో జిల్లాలోకి మాదకద్రవ్యాలు వచ్చే అవకాశం ఉన్నందున సరిహద్దు ప్రాంతాలలో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక గిరిజన యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మారుమూల ప్రాంతాలలో ఉండే గుత్తి కోయ గ్రామాలకు రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా స్టాక్ రూమ్స్ ఏర్పాటు చేసుకోవాలని , మహిళలు స్వయం ఉపాధి కుటీర పరిశ్రమలను నెలకొల్పే అంశంలో బ్యాంకు లింకేజీ రుణాలు పొందడంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని వరద ముంపు ప్రాంతాలలో ఫ్లెడ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని గిరిజన ప్రాంతాలలో నిరంతరం విద్యుత్ సేవలు అందే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజల నుంచి వచ్చిన సమస్యల దరఖాస్తులను నిర్లక్ష్యం వహించకుండా జవాబుదారితనంగా వాటి సాధ్యాలను వెంటనే వారికి వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సత్యపాల్ రెడ్డి, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఐటీడీఏ డిడి పోచాం, డి ఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, డాక్టర్ క్రాంతి కుమార్, ఓ రాజ్ కుమార్, జిసిసి జనరల్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, డి డబ్ల్యు ఓ స్వర్ణలత లెనిన, ఐటీడీఏ ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో కల్తీ మద్యానికి పది మంది బలి..!

# కలెక్టర్, ఎస్పీపై ప్రభుత్వం చర్యలు

తమిళనాడులో కల్తీ మద్యానికి పది మంది బలయ్యారు. కళ్లకురిచి జిల్లాలో కల్తీ మద్యం తాగడంతో పదిమంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. వారిని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. కల్తీ సారా విక్రయాలపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ విచారణకు స్టాలిన్ ఆదేశించారు. అదే సమయంలో కలెక్టర్ శ్రావణ్‌కుమార్ జతావత్‌పై బదిలీ వేటు వేశారు.



కళ్లకురిచ్చి జిల్లా కొత్త కలెక్టర్‌గా ఎంఎస్ ప్రశాంత్‌ను ప్రభుత్వం నియమించింది. అలాగే కళ్లకురిచ్చి ఎస్పీ సమయసింగ్ మీనాపై సస్పెన్షన్ వేటు పడింది. ఎస్పీగా రజత్ చతుర్వేది నియమితులయ్యారు. అలాగే, ఈ ఘటనలో పలువురు పోలీసు అధికారులను సైతం ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

# చిప్స్ ప్యాకెట్‌లో చచ్చిన కప్ప.. అధికారులు దర్యాప్తు



అహ్మదాబాద్: చిప్స్ ప్యాకెట్‌లో చచ్చిన కప్ప కనిపించింది. ఇది చూసి ఒక కుటుంబం షాక్ అయ్యింది. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో చిప్స్ తయారీ సంస్థపై దర్యాప్తు చేస్తున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. మంగళవారం సాయంత్రం పుష్కర్ ధామ్ సొసైటీకి చెందిన జాస్మిన్ పటేల్ నాలుగేళ్ల మేనకోడలు స్థానిక షాపు నుంచి చిప్స్ ప్యాకెట్ కొనుగోలు చేసింది. ఆ మహిళ తొమ్మిది నెలల కూతురు, ఆ చిన్నారి కలిసి చిప్స్ తిన్నారు. కాగా, చిప్స్ ప్యాకెట్‌లో చనిపోయిన కప్పను ఆ పాప గమనించింది. ఆ వెంటనే ఆ ప్యాకెట్‌ను దూరంగా విసిరేసింది. ఆ చిప్స్ ప్యాకెట్‌ను బాలాజీ వేఫర్స్ అనే సంస్థ తయారు చేసినట్లు జాస్మిన్ పటేల్ గమనించింది. ఆ కంపెనీ డిస్ట్రిబ్యూటర్, కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసింది. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో బుధవారం ఉదయం ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫిర్యాదు చేసింది. మరోవైపు జామ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ సంఘటనపై స్పందించారు. చిప్స్ ప్యాకెట్ అమ్మిన షాపును తనిఖీ చేశారు. బాలాజీ వేఫర్స్ తయారు చేసిన చిప్స్ ప్యాకెట్ల బ్యాచ్ నుంచి శాంపిల్స్ సేకరిస్తామని తెలిపారు. దర్యాప్తు తర్వాత తగిన చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com